14 అక్టోబరు 2001

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం

ఇంద్రకీలాద్రి, విజయవాడ. ఫోన్ : 423600

శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవములు - 2001

ఆర్.సి. నెం. ఎఫ్ 2/4545/2001, ది. 13-8-2001

విజయవాడ
ఇంద్రకీలాద్రిపై
వేంచేసియున్న
శ్రీ కనకదుర్గఅమ్మవారి
దసరా
మహోత్సవములు
ది. 17-10-2001
నుండి
ది. 26-10-2001
వరకు



విశేష దివ్య
అలంకారములతో
అత్యంత
వైభవోపేతముగా
జరుగును

తేదీ	వారము	తిథి	అలంకారము	ఉభయ రుసుము రూ.
17-10-2001	బుధవారం	ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి	శ్రీ స్వర్ణ కవచాలంకృత కనకదుర్గాదేవి	2,000=00
18-10-2001	గురువారం	ఆశ్వీయుజ శుద్ధ విదియ	శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి	2,000=00
19-10-2001	శుక్రవారం	ఆశ్వీయుజ శుద్ధ తదియ	శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి	2,000=00
20-10-2001	శనివారం	ఆశ్వీయుజ శుద్ధ చవితి	శ్రీ గాయత్రీదేవి	2,000=00
21-10-2001	ఆదివారం	ఆశ్వీయుజ శుద్ధ పంచమి	శ్రీ అన్నపూర్ణాదేవి	2,000=00
22-10-2001	సోమవారం	ఆశ్వీయుజ శుద్ధ షష్ఠి (మూలా నక్షత్రం)	శ్రీ సరస్వతీ దేవి	3,000=00
23-10-2001	మంగళవారం	ఆశ్వీయుజ శుద్ధ సప్తమి	శ్రీ మహాలక్ష్మీదేవి	2,000=00
24-10-2001	బుధవారం	ఆశ్వీయుజ శుద్ధ అష్టమి	శ్రీ దుర్గాదేవి	2,000=00
25-10-2001	గురువారం	ఆశ్వీయుజ శుద్ధ నవమి	శ్రీ మహిషాసుర మర్ధినీదేవి	2,000=00
26-10-2001	శుక్రవారం	ఆశ్వీయుజ శుద్ధ దశమి	శ్రీ రాజరాజేశ్వరిదేవి	2,000=00

పై దసరా మహోత్సవములలో దివ్య అలంకారములతో శ్రీ కనకదుర్గ అమ్మవారికి విశేష అర్చనలు జరుపుటకు మీకు అభీష్టం వున్నయెడల ఏ రోజున ఉభయం కోరెదరో తెలుపుచూ, ఆ తేదీన నిర్ణయించబడిన ఉభయ రుసుము కార్యనిర్వహణాధికారి, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, విజయవాడ-1 వారి పేరున స్వయముగా గాని, డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారాగాని చెల్లించి రశీదు పొందవలెను. రశీదు లేకుండా ఉభయ రుసుము చెల్లించిన యెడల దేవస్థానమునకు ఎటువంటి సంబంధము లేదు. ఉభయ రుసుము ది. 1-9-2001 నుండి దేవస్థానం ట్రెజరీ సెక్షన్ యందు కట్టించుకొనబడును.

ఉభయ దాతల పూజలు దేవాలయ ప్రాంగణములో గల శ్రీ భవానీ దీక్షా మండలములో జరుగును. అక్కడ దంపతులను మాత్రమే అనుమతించబడును. మిగిలినవారు ప్రత్యేక ప్రదేశములలో కూర్చుండవలెను. విశేష పూజ జరుపు ఉభయ దాతలకు దంపతులతో సహా (5) ఐదుగురికి అంతరాలయ ప్రవేశము, హారతి దర్శనము లభించును. ఉభయ దాతలు ఉదయం 8.00 గంటలకు శ్రీ భవానీ దీక్షా మండలములో హాజరుకావలెను.

దసరా 10 రోజులు శ్రీ అమ్మవారి విశేష అలంకారములను దర్శించుకొనుటకు రు. 750/- టికెట్లు కొన్నయెడల ఇద్దరిని, రు. 500/- టికెట్లు కొన్నయెడల ఒక్కరిని మాత్రమే క్యూ మార్గము ద్వారా పంపబడును. ఉదయం 6.00 గంటల నుండి 8.00 గంటల వరకు లేదా రాత్రి 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు ప్రత్యేక క్యూ మార్గము ద్వారా అంతరాలయ దర్శనము లభించును.

ది. 17-10-2001న శ్రీ అమ్మవారికి స్నపనాభిషేకములు జరుగును. స్నపనాభిషేకములు అనంతరం ఉదయం 9.00 గంటలకు శ్రీ అమ్మవారి దర్శనము లభించును.

ది. 17-10-2001 నుండి 26-10-2001 వరకు ప్రతిరోజు "చండీహోమం" జరుపబడును. ఈ హోమం నందు పాల్గొనదలచిన దంపతులకు రోజుకు టికెట్ రు. 350.00లు. చండీ హోమానంతరం శ్రీ అమ్మవారి అంతరాలయ దర్శనము మరియు హారతి, ప్రసాద వినియోగం లభించును. మరియు ప్రతిరోజూ "శ్రీ చక్ర నవావరణార్చన" దేవస్థానము వారిచే జరుపబడును. రూ. 516/-ల రుసుము చెల్లించి భక్తులు కూడా ఈ అర్చనయందు పాల్గొనవచ్చును.

విజయవాడ
తేదీ : 13-8-2001.

ఇ. గోపాలక్రిష్ణారెడ్డి, B.Sc., L.L.M.,
జాయింట్ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి.

లోపలి పేజీల్లో.....



పిల్లల చేత ఎలాంటి పుస్తకాలు చదివించాలి? ... 10

మనోల్లాసానికి మైసూర్ యాత్ర ... 16

మారణహోమాలు ... 14

'ఛాయా గ్రహణంలో మట్టి బతుకులు' ... 21

ఇంకా...

ఆరోగ్యం 6, 7

బాలల కథ 10

బాల నేస్తాలు 12, 13

క్రీడారంగం 17

కథ 18, 19

పుస్తకపరిచయం 20

కచేరి 23

పలుకుబడి 24

వగైరా.......

ఘర్షణ - సంఘర్షణ

మనలో మాట

కొందరు ప్రతి చిన్న విషయానికీ తమలో తామే ఘర్షణ పడిపోతుంటారు. మధనపడిపోతుంటారు. ఎటూతేల్చుకోలేరు. ఏ విషయంపైనా నిర్ణయాత్మకంగా వ్యవహరించలేరు. పిరికితనం, మొహమాటం వారి మౌలిక లక్షణాలు. వెరసి ఒక్క ముక్కలో చెప్పాలంటే వాళ్ళు రా.వి.శాస్త్రి అల్పజీవిలో సుబ్బయ్యలాంటి వారు. ఇటువంటి వారు అందరి దగ్గర అణిగిమణిగి ఉంటారు. ఎప్పుడూ ఓమూలకు ఒదిగిపోతారు. ఎవరితో మాట్లాడితే ఏం ముంచుకొస్తుందోనని భయం. అడుగు ముందుకెయ్యాలంటే భయం. వెనక్కి తియ్యాలంటే భయం. ఆఫీసరు పిలుస్తున్నాడంటేనే ముచ్చెమటలు పోస్తాయి. ఆయన అడిగే సాదాసీదా ప్రశ్నకు సైతం సమాధానం చెప్పడానికి గజగజవణికిపోతారు. ఏ మాట మాట్లాడితే ఏం ప్రమాదమో. ఉద్యోగానికే ఎసరు వస్తుందేమో. ఇలా ఉంటుంది వీరి ధోరణి. ఇలాంటి వారు ఏ విషయాన్ని గురించీ సంపూర్ణంగా, సమగ్రంగా ఆలోచించ లేరు, అవగాహన చేసుకోలేరు. ఎప్పుడూ భయమూ, ఆందోళన, హడావిడి. దేన్ని గురించీ కచ్చితమైన నిర్ధారణకు రాలేని వీరు ప్రతి విషయంలోనూ రాజీపడి పోతుంటారు. ఇటువంటి బలవంతపు రాజీలు మెతకదనానికి చిహ్నాలు. మెతకదనం అనేది ఒక బలహీనత. ఈ బలహీనత ఆత్మన్యూనతా భావం నుండే ఆవిర్భవిస్తుంది. తమ శక్తిపై తమకు విశ్వాసం లేని వారే ఇలా వ్యవహరిస్తారు. ఇలాంటి వారు ఏ రంగంలోనూ రాణించలేరు. ఎదుటి వారి చేత అసమర్థులుగా పరిగణించబడతారు. ఈ పరిస్థితి దీర్ఘకాలం కొనసాగితే డిప్రెషన్‌లో పడిపోతారు. ఈ బాపతు వారిలోనే కొంచెం తెలివి కల్గిన వారు, లేదా తెలివైన వారమని భావించుకునే కొందరుంటారు. తానొవ్వక ఎదుటి వారిని నొప్పించక, తప్పించుకోవడమే ధన్యమనుకునే రకం. వీరిదీ ఒక రకమైన ఆత్మన్యూనతే. దాన్ని కప్పి పెట్టుకోవడానికే ఇలా వ్యవహరిస్తారు. అయితే మెతగ్గా కనిపిస్తూనే ఆయువు పట్టు దగ్గర ఉక్కులా గట్టిగా పట్టుకొనే వారు ఈ ఇద్దరి కోవకూ చెందరు. ప్రశాంతంగా పూర్తి ఆత్మవిశ్వాసంతో తమ పని తాము చేసుకుపోతుంటారు.

వీరెవరూ కాకుండా మరో రకం వారున్నారు. నిత్యం ఇతరులతో సంఘర్షణ పడటమే వారి నైజం. అలా తగాదా పడితే తప్ప నెగ్గుకు రాలేమన్నది వారి ధృఢ విశ్వాసం. ఇదీ ఒకరకమైన ఆత్మన్యూనత నుండి ఆవిర్భవించిన లక్షణమే. ఎదుటివారిని తమ అవగాహనతో, వాదనా పటిమతో, సామర్థ్యంతో ఒప్పించలేమనుకునే వారు మాత్రమే ఇలా వ్యవహరిస్తారు. దీనికి చక్కటి ఉదాహరణ నాకు తెలిసిన గంభీరరావే. ఆయన పేరుకే కాదు పైకి కూడా గంభీరంగా కనిపించాలని తెగ తాపత్రయపడిపోతుంటాడు. నిన్న మొన్నటిదాకా సెక్షను ఆఫీసరుగా ఉన్న అతనికి ఈ మధ్యనే ప్రమోషన్ వచ్చింది. అయితే ఖర్మకాలి ఆయన్ను అదే బ్రాంచి మేనేజరుగా నియమించారు. కాని నిన్నటి దాకా సమాన స్థాయిలో పని చేసిన సహోద్యోగులు ఇప్పుడు తన అధికారాన్ని గుర్తిస్తారా, గుర్తించరా అన్న బాధ గంభీరరావును అనుక్షణం తొలిచేస్తుండేది. తన అధికారాన్ని గుర్తించేలా చేసుకోవాలని ప్రతి క్షణం హైరానపడేవాడు. అనవసరమైన హడావిడి ఆదేశాలు. దీనితో తోటివారికి చిర్రెత్తుకొచ్చింది. తమకన్నా ఏవో కొన్ని అదనపు అర్హతలుండటం వల్లనే గంభీరరావుకు ప్రమోషన్ వచ్చిందన్న సంగతి వారందరికీ తెలుసు. ఆ విషయాన్ని ఆయన తన చేతల్లో చూపించి, వాటికి మరింత సాన బెట్టుకుంటే తోటివారు చక్కగా గౌరవించే వారు. ఆయనకిచ్చే గుర్తింపునూ ఇచ్చే వారు. కాని అతగాడు ఈ విషయాన్ని వదిలిపెట్టి అధికార ప్రదర్శన మీదనే కేంద్రీకరించాడు. అలా ఆయన అధికార దర్పాన్ని అంగీకరించని వారిపై నిత్యం తగాదాకు దిగేవాడు. దీనితో ఆఫీసు వాతావరణం యుద్ధరంగాన్ని తలపించేదిగా తయారయింది. చివరికి గంభీరరావు ఉన్నత స్థానంలో తన బాధ్యతలను నిర్వహించడం అలా ఉంచి, సాధారణంగా తాను చేసే పనులు సైతం చెయ్యలేని స్థితిలో పడిపోయాడు.

అందువల్ల పైన చెప్పినట్లు తమలో తాము ఘర్షణపడి పోవడంగాని, లేదంటే అదే పనిగా ఎదుటివారితో సంఘర్షించడం కాని ఎంతమాత్రం తగని విషయాలు. ఆ రకమైన ప్రవర్తన వారికీ, ఎదుటి వారికీ కూడా అనర్థమే. ☆

దళితులపై వివక్షకు అంతం ఎన్నడు?

ఎం.కోటేశ్వరరావు

రాష్ట్రంలో కులవివక్ష ఉన్నదని అంగీకరించేందుకు తిరస్కరించిన చంద్రబాబు సర్కార్ ఈ అంశంపై విస్తృతంగా విచారణ జరిపిన జస్టిస్ కె. పున్నయ్య కమిషన్ నివేదిక సిఫార్సులను అమలు జరిపేందుకు అంగీకరించింది. రాష్ట్రంలో, దేశంలో దళితులు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పథకాలు ప్రకటించటానికి, కమిషన్‌లు వేయటానికి అంగీకరించని, చట్టాలు చేయని ప్రభుత్వం, పాలకవర్గంలేదు. వాటి అమలు ఎలా జరిగిందన్నదే అసలు సమస్య. ఈ విషయంలో కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి వంటి పార్టీలన్నీ ఒక తానులో ముక్కలే. పున్నయ్య కమిషన్ తేల్చిన సారమిదే. విచారణ కమిషన్ వేసేందుకు ఒక పట్టాన అంగీకరించక డిమాండ్ చేసిన వారిపై లాఠీలు ఝుళిపించి రక్తం కళ్ల చూసిన పెద్ద మనిషి చంద్రబాబు. అలలకు ఎదురీదటం సాధ్యం కాదనుకుంటే దానిని తప్పించుకునేందుకు వెన్ను చూపి బయట పడినట్లుగా నివేదిక వెల్లడి, ఆమోదానికి మరోసారి దళితులు, గిరిజనులు వీధులలోకి రాకుండా నివారించేందుకు ఆమోదించే మార్గాన్ని ఎన్నుకున్నారు. మొరటు భూస్వామిక వర్గానికి, హైటెక్ పెట్టుబడిదారీ వర్గ ప్రతినిధికి ఎంత తేడా ఉంటుందో చూపారు. దర్బన్‌లో జరిగిన ప్రపంచ జాతి వివక్ష వ్యతిరేక సదస్సులో మనదేశంలోని అంటరాని తనాన్ని చర్చించేందుకు తిరస్కరించిన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మాట మాత్రంగా విమర్శ చేయని చంద్రబాబు ఇంతతేలికగా నివేదికను ఆమోదించారంటే చిత్తశుద్ధిని శంకించాల్సిందే.

పున్నయ్య కమిషన్ నివేదిక దళితులు, గిరిజనుల సమస్యలపై రెండు భాగాలుగా వుంది. అంటరానితనం చారిత్రక నేపథ్యం, దాని తొలగింపు భాధ్యత అంటరానివారికి, దేశానికి వదలి వేయాలా అన్న ప్రధానమైన చర్చనీయాంశాన్ని పొందుపర్చినతీరు ఒక పొరపాటు ఆలోచనా ధోరణిలో కొట్టుకుపోతున్న వారికి కనువిప్పు కలిగించేదిగా ఉందని చెప్పవచ్చు. మహాత్మాగాంధీ, నాటి కాంగ్రెస్ పిలుపు మేరకు అనేకమంది దళితేతరులు ఆసమస్య తీవ్రతను అర్థం చేసుకొని ఏవిధంగా కృషిచేసింది వివరణాత్మకంగా జస్టిస్ పున్నయ్య వివరించినతీరు దళితుల సమస్యలు దళితులకే గాని ఇతరులకు ఏమి తెలుసు అని ప్రశ్నించే వారికి సమాధానం చెబుతుంది.

ప్రజలను వర్ణ ప్రాతిపదికగా చీల్చి అంటరానితనాన్ని పెంచి పోషించిన మనువాద భావజాలం, ఆచరణకు వ్యతిరేకంగా అభివృద్ధి చెందిన బౌద్ధం అంటరానితనాన్ని , కులవ్యవస్థను

అధికారుల సమన్వయ కృషి, దళితుల చైతన్యంతో అత్యాచారాలను నిరోధించగలం

ఎంతో శ్రమ కోర్చి రాష్ట్రమంతా పర్యటించి దళితుల స్థితిగతులపై నివేదికను తయారుచేసినందునకు ముందుగా మీకు అభివందనలు.

ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించాను.

కమిషన్ పర్యటనలో మీ అనుభవాలు వివరిస్తారా?

ప్రతి రెవెన్యూ డివిజన్ హెడ్‌క్వార్టర్స్‌లో క్యాంప్ ఏర్పాటు చేశాం. జిల్లా ప్రభుత్వ యంత్రాంగం బాగా సహకరించింది. ప్రతి డివిజన్ నుండి దళితుల నుండి వేలాది పిటీషన్లు వచ్చాయి. మండలస్థాయిలో పెట్టి ఉంటే మరింత స్పందన వచ్చి ఉండేది. సాంఘిక సంక్షేమ శాఖ, కలెక్టర్లు కమిషన్ పర్యటన గురించి గ్రామాల్లో ప్రచారం చేశారు. నా పర్యటనలో దళిత సంఘాలు ప్రముఖ పాత్ర వహించాయి.

ప్రభుత్వం మీ సిఫార్సులను వేటిని అంగీకరించింది? వేటిని మినహాయించింది? మినహాయించిన వాటిలో కీలకమైనవి ఉన్నాయా?

దాదాపు అన్నింటిని అంగీకరించినట్లే. నా రికమండేషన్స్‌ని మూడు భాగాలుగా విభజించాను. అందులో మొదటిది కులవివక్ష చూపకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు(ప్రికాషన్), రెండవది ఏదైనా ఘటన జరిగిన తర్వాత ప్రభుత్వం నిర్వహించాల్సిన కర్తవ్యం(ప్రివెన్షన్), మూడవది శిక్ష (ప్యూనిటీ). పలు ముఖ్యమైన సిఫార్సులు ఉన్నాయి. నేనిచ్చిన వాటిలో రాష్ట్రస్థాయిలో నోడల్ ఆఫీసర్(ప్రత్యేక అధికారి)ని నియమించాలన్నది ఒకటి. ఈ అధికారి కలెక్టర్లు, ఎస్పీల సమన్వయంతో అత్యాచార ఘటనలను పరిశీలించాలి. మూడు నెలలకు ఒకసారి కేసుల పరిస్థితి, విచారణలో పురోగతిని రాష్ట్రస్థాయిలో సమీక్ష చేయాలి.

జస్టిస్ కె.పున్నయ్య

దళితులపై అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్న జిల్లాల్లో ప్రత్యేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

దళితుల అత్యాచార ఘటనలు ఎక్కువగా నమోదవుతున్న ప్రకాశం, గుంటూరు, కడప, కర్నూలు, విజయనగరం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో అత్యాచార నిరోధక చట్టంలోని రూల్ 10 ఆధారంగా ప్రత్యేకాధికారులను నియమించాలని కోరాను. మరో ముఖ్యమైనది ఏమిటంటే ప్రతి సిఐ, ఎస్ఐ ప్రతి శుక్రవారం రెండు గ్రామాలు చొప్పున తన పరిధిలోని 60గ్రామాలను సందర్శించాలని సిఫార్సు చేశాను. ఈ లెక్కన ఏడాదిన్నర కాలంలో పోలీస్ అధికారులు రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు వెళ్ళగలుగుతారు. ప్రభుత్వం ఈ సిఫార్సును అంగీకరించింది కానీ వారానికి ఒక గ్రామం మాత్రమే వెళ్ళగలమని తెలిపింది. ఆ రోజున పోలీసులు దళితులను దగ్గరుండి ఆలయంలోకి తీసుకెళ్ళాలి, రెండు గ్లాసుల పద్ధతి, ఇతరత్రా వివక్షా పద్ధతులను పరిశీలించి సమస్య పరిష్కరించేట్లు చేయాలి. దాడులు జరిగిన చోట బాధితులకు తక్షణం సాయం చేయాలి. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో దళిత ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేయాలి. హైపవర్ కమిటీని అలానే జిల్లా, మండల స్థాయిల్లో స్వచ్ఛందసంస్థలను కలుపుకుని కమిటీలను నియమించాలి.

కుల వివక్ష నిర్మూలనలో దళిత సంఘాలు, స్వచ్ఛంద సంస్థల పాత్ర ఏమిటి?

కర్తవ్య నిర్వహణలో నిర్మాణాత్మకమైన దళిత సంఘాల పాత్ర కీలకమైనది. జిల్లా స్థాయిలోని ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ సెల్ పనితీరును ఆయా సంఘాలు పరిశీలించవచ్చు.

సమస్యాత్మక జిల్లాల్లో అత్యాచారాల నిరోధక చట్టం కింద ప్రత్యేకాధికారులను నియమించినట్లు ప్రభుత్వం చెపుతున్నది కదా?

ప్రత్యేకాధికారులు ఉన్నా పని చేయటం లేదు. జిల్లా స్థాయిలో అధికారులంతా సమన్వయంతో పని చేసినపుడే దళితులపై అత్యాచారాలను అరికట్టగలం. దళితులను చైతన్యపరిచేందుకు వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహించాలి.

దళితుల సమస్యకు ఇతర పరిష్కారమార్గాలు ఉన్నాయా?

భూసమస్య కీలకమయింది. పెండింగ్‌లో ఉన్న భూవివాదాలను అధికారులు గ్రామస్థాయిలో పరిష్కరించాలి. బంజరు భూములు ఆక్రమణలో ఉంటే వాటిని ఖాళీ చేయించి తక్షణం పేదలకు అప్పగించాలి. ఐడెంటిఫైడ్ ఏరియాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి.

ఇంటర్వ్యూ: ఎస్.సరిత

సిఫారసుల అమలుకోసం ఉద్యమం

- జాన్‌వెస్లీ, కార్యదర్శి, కులవివక్ష వ్యతిరేక పోరాట కమిటీ

దళితులపై దాడుల పరిస్థితి, వాటి తీవ్రత ఎలా ఉంది ?

అంటరానితనం, కులవివక్షకు వ్యతిరేకంగా ప్రశ్నించేతత్వం దళితుల్లో పెరిగింది. సామాజిక న్యాయం కోసం ఐక్యపోరాటాలు పెరుగుతున్నాయి. ఈ సమయంలో దళితులు చైతన్యులు కాకుండా ఉండటానికి, వారిని అణిచివేయడానికి పెత్తందారుల ప్రయత్నాలు కూడా పెరిగాయి. ఈ రకంగా రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయి. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాలో వీటి తీవ్రత అధికంగా ఉంది. గ్రామంలో గడ్డివాములు వాటంతట అవే తగలబడుతుంటే వాటికి నామాల బాలస్వామి అనే దళిత యువకుడే కారణమని అగ్రవర్ణాలు ప్రచారం చేసి అతన్ని సజీవంగా ఆ గడ్డివాముల్లోనే వేసి తగులబెట్టారు. కడప జిల్లా తిర్మలాపురం గ్రామంలో అగ్రకులాలకు వ్యతిరేకంగా ఓటు వేసినందుకు గాను 2 సంవత్సరాలుగా సాంఘిక బహిష్కరణ సాగుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో అధికార పార్టీ ఓడిపోతుందని మాట్లాడినందుకు శిరోముండనం చేసి అవమానపరిచారు.

పున్నయ్య కమిషన్ నియామక నేపథ్యం ఏమిటి ?

కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా 1998 అక్టోబర్ ఒకటిన కులవివక్ష వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పడింది. ఆ సమయంలో రాష్ట్రం అంతటా కులవివక్ష కొనసాగుతోంది. వీటిని అరికట్టేందుకు గాను దాదాపు 11వేల గ్రామాల్లో దళితులపై దాడులు, కులవివక్షతా రూపాలకు సంబంధించి సర్వే చేసి ఆ రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది. దీనిపై ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదు. వెంటనే పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ల దిగ్బంధనం, రాస్తారోకో వంటి ఆందోళనలు చేపట్టాం. చివరగా 1999 మార్చి 22న 'చలో అసెంబ్లీ'కి పిలుపిచ్చాం. ఈ కార్యక్రమాన్ని అణిచి వేయడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. లాఠీచార్జీ చేయడంతో పాటు వాటర్‌కానన్‌లు కూడా ప్రయోగించింది. అయినా ఆందోళనకారులు చెక్కుచెదరలేదు. దీనిపై అసెంబ్లీలో చర్చ జరపాలని ప్రధానంగా సిపిఎం సభ్యులు లేవనెత్తగా మిగతా ప్రతిపక్ష సభ్యులు కూడా మద్దతివ్వడంతో అసెంబ్లీలో చర్చ జరిగింది. దీనిపై అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయడంతో పున్నయ్య కమిషన్ ఏర్పాటయ్యింది.

పున్నయ్య కమిషన్ సిఫారసులపై మీ అభిప్రాయం ఏమిటి ?

ఈ కమిషన్ పోరాట ఫలితంగా ఏర్పడిందే తప్ప ప్రభుత్వం చిత్తశుద్ధితో ఏర్పాటు చేసింది కాదు. ప్రారంభంలోనే ఈ కమిషన్ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. ఆరునెలల వరకు ఆఫీసు కానీ, సిబ్బందిని కానీ కేటాయించలేదు. వీటికోసం కూడా పోరాట కమిటీ ఒత్తిడి చేయాల్సి వచ్చింది. ఈ కమిషన్ రెండున్నర సంవత్సరాల పాటు రాష్ట్రవాప్తంగా పర్యటించింది. ఈ సంధర్భంగా వేలాది మంది దళితులు 8,311 పిటిషన్లను కమిషన్‌కు సమర్పించారు. దీనికి రెట్టింపు సంఖ్యలో దళితులు తమ సమస్యలను నోటి మాటగా చెప్పారు. కమిషన్ కొన్ని అంశాలను ప్రముఖంగా వ్యక్తం చేసింది. రాష్ట్రంలో కులవివక్ష లేదని ప్రభుత్వం వాదిస్తున్న క్రమంలో ఇప్పటికీ అంటరానితనం ఉందని, ప్రభుత్వ యంత్రాంగం పెత్తందార్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని, ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని కమిషన్ గుర్తించింది. అయితే దళితులకు సంబంధించిన ఆర్థిక సమస్యలు ముఖ్యంగా భూసమస్య, విద్య, ఉద్యోగాల సమస్యలు సిఫార్సుల్లో చోటు చేసుకోలేదు.

ప్రభుత్వం పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు జరుపుతానంటున్నది. వాటి అమలుకు మీరు ఏ విధమైన కృషి చేస్తారు ?

కమిషన్ సిఫారసులను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్న నమ్మకం లేదు. ఈ ఏడాది మే 31న కమిషన్ ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించింది. దీనిపై అసెంబ్లీలో చర్చ జరపాలని డిమాండ్ చేస్తే దాని ప్రాధాన్యతను తగ్గించేందుకు గాను చర్చకు నిరాకరించింది. ఆ తర్వాత క్యాబినెట్ సమావేశం జరిపి కమిషన్ సిఫారసులను ఆమోదిస్తున్నట్లు ఒక్క మాటలో చెప్పింది. దీని అమలుపై కనీసం రాజకీయపార్టీలతో చర్చలు జరపలేదు. దళిత సంఘాలతోనైనా సమావేశం జరపాల్సిన అవసరాన్ని నిర్లక్ష్యం చేసింది.

కులవివక్ష వ్యతిరేక పోరాట కమిటీ ఏ విధమైన కార్యాచరణకు పూనుకుంటున్నది ?

కమిషన్ ఏర్పాటుతోనే సమస్య పరిష్కారం కాదు. కనుక కమిషన్ సూచించిన అంశాల అమలుకు ఉద్యమం చేయాలని భావిస్తున్నాం. ఈ క్రమంలో మాతో కలిసి వచ్చే వారందరినీ కలుపుకుంటాం. అదే విధంగా కమిషన్ పరిధిలో లేని అంశాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. దళితుల్లో నేడు చైతన్యం పెరుగుతోంది. గతంలో మాదిరి వారిని ఏదో భ్రమలకు గురి చేస్తే మోసపోయే స్థితిలో వారు లేరు. ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి సిద్ధంగా ఉన్నారు.

ఇంటర్వ్యూ : **కంభాలపల్లి కృష్ణ**

ఖండించింది. రామానుజాచార్యుల మొదలు రామకృష్ణ పరమహంస, నారాయణగురు, మహాత్మాగాంధీ వరకు ఈ దురాచారాన్ని ఎంతగా ఖండించినా , వ్యతిరేకించినా ఈ విషమహావృక్షపు ఆకును కూడా కదిలించలేకపోయింది. అందువలనే జాతీయవాదులు స్వాతంత్ర్యంపై తప్ప ఈ సమస్యపై దృష్టి పెట్టలేదన్న అంబేద్కర్ విమర్శను పున్నయ్య ఉటంకించారు. అయితే అంబేద్కర్ వైఖరిని అందరూ పూర్తిగా అంగీకరించక పోవచ్చు. అంబేద్కర్ 1927లో కొలాబాజిల్లా మహద్ గ్రామంలోని చవదార్ చెరువునుండి నీటిని తీసుకొనేందుకు సత్యాగ్రహాన్ని నిర్వహించారు. అలాంటి అంబేద్కర్ రాజ్యాంగపరిషత్ అధ్యక్షుడిగా రాజ్యాంగరచన జరిగింది. అంటరానితనాన్ని రూపుమాపేందుకు అందులో పొందుపరిచారు. అనేక సవరణలు జరిపి గత ఐదు దశాబ్దాలలో అనేక చట్టాలకు మరింతపదును పెట్టినా జరిగిందేమీ లేదు. ఇదే విషయాన్ని పున్నయ్య తన విస్తృత నివేదికలో మరోసారి నిర్ధారించారు. చారిత్రాత్మకమైనదిగా వర్ణించే పూనా ఒప్పందం 1932 సెప్టెంబర్ 25న జరిగింది. అంటరానితనం నిర్మూలనకు చేసే కృషిలో భాగంగా దళితులకు ప్రత్యేకనియోజకవర్గాలు ఉండాలని అంబేద్కర్ ప్రతిపాదించారు. వాటి వలన సమాజం రెండుగా చీలుతుందని గాంధీ అంగీకరించలేదు. చివరకు సంయుక్త నియోజకవర్గాలకు అంబేద్కర్ అంగీకరించారు. ఆ సందర్భంగానే మదనమోహనమాలవ్య, రాజగోపాలాచారి మొదలైన 35 మంది అగ్రవర్ణ హిందువులు, అంబేద్కర్ మరో ఐదుగురు అణగారిన వర్గ ప్రతినిధుల మధ్య అంటరానితన నిర్మూలనకు కుదిరినదే పూనా ఒప్పందం. జాతీయనాయకుల వారసులే తరువాత దాన్ని తుంగలో తొక్కారు. అటువంటి స్థితిలో చెప్పిన పనిచేయని, చేసేది చెప్పని వ్యక్తిగా పేరుగాంచిన చంద్రబాబు పున్నయ్య కమిషన్ నివేదికను ఆమోదించినా అమలు జరుపుతారంటే నమ్మకం ఎలా కలుగుతుంది.

పూనా ఒప్పందం స్ఫూర్తిని అసలు అమలుజరపక పోలేదు. సనాతనవాదులు తీవ్రంగా ప్రతిఘటించినప్పటికీ గాంధీ పిలుపు మేరకు అనేకమంది రాష్ట్రంలోని పలుచోట్ల అంటరానితనానికి వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమాలను పున్నయ్య సోదాహరణంగా వివరించారు. అంబేద్కర్ తరువాత ఆయన అనుచరులుగా ఉన్న వారు అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలుగా జరిపిన కార్యాచరణ కనిపించదు. సంఘటనలు జరిగినపుడు స్పందించి ఉండ వచ్చు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనాన్ని రద్దుచేసినా, ఆర్టికల్ 15(2) వివక్షను నిషేధించినా 1955 నాటి పిసిఆర్ చట్టం శిక్షలను నిర్దేశించినా 52 ఏండ్ల తరువాత తెలంగాణా, రాయలసీమలోని అన్ని మండలాలు, ఉత్తరాంధ్ర, సర్కార్‌జిల్లాలలోని వెనుకబడిన ప్రాంతాలలో అంటరానితనం దాదాపు అన్ని గ్రామాలలో ప్రబలి ఉందని పున్నయ్య పేర్కొన్నారు. దళితులకు దేవాలయ ప్రవేశం నిరాకరించినా, సామాజిక బావులు, బోర్ల నుండి నీటిని తీసుకునేందుకు ఆటంకపరిచినా ,

అతి తక్కువ వ్యవధిలో ఆమోదించాం

టి. దేవేందర్‌గౌడ్,
రాష్ట్ర హోంశాఖామాత్యులు

రాష్ట్రంలో దళితులస్థితి, పున్నయ్య కమిషన్ సిఫార్సుల గురించి వివరిస్తారా?

స్వాతంత్ర్యం వచ్చి యాభై సంవత్సరాలైనా ఇంకా దళితులపై వివక్ష కొనసాగడం మనం సిగ్గు పడాల్సిన అంశం. ఈ సమస్యను సీరియస్‌గా పరిగణించాలి. దళితులపై అత్యాచారాలను శాంతిభద్రతల అంశంగా చూడకూడదు. ఇది సామాజిక సమస్య. కులవివక్ష ఉందనేది వాస్తవం. సామాజిక దృక్పథంతోనే దీన్ని పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

పున్నయ్య కమిషన్ నివేదిక సమర్పించిన తర్వాత వాటిని ఆమోదించడానికి ఎందుకు ఇంత సమయం తీసుకున్నారు?

అలా అని ఎందుకనుకుంటున్నారు. అతి తక్కువ కాలంలో సిఫార్సులు ఆమోదించిన మొట్టమొదటి కమిషన్ ఇదే. నివేదిక ఇచ్చిన వారం రోజుల్లో కేబినెట్ సబ్‌కమిటీ వేశాం. పది రోజుల్లో సిఫార్సులను స్టడీ చేశాం. 15రోజుల వ్యవధిలో కమిషన్ సిఫార్సులను ఆమోదించాం. ఇంత త్వరగా ఆమోదం పొందిన కమిషన్ ఇంకేదీ లేదు. కమిషన్ అన్ని సిఫార్సులను ఆమోదించాం.

అంగీకరించిన సిఫార్సుల అమలు కోసం ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నది?

ప్రభుత్వం ఒక ప్లాన్ ప్రకారం ముందుకు వెళుతోంది. దీని కోసం నవంబర్ ఒకటి నుండి ప్రత్యక్ష కార్యాచరణ ప్రారంభించనున్నాం. జన్మభూమి తరహాలో అధికారులు, అనధికారులు గ్రామాలకు వెళ్ళి కులవివక్షపై ప్రజలను చైతన్యం చేస్తారు. ప్రత్యేక జన్మభూమి లానే ఈ కార్యక్రమం సాగుతుంది. గ్రామాల్లో ఉద్రేకాలకు దారితీయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు. సిఫార్సుల అమలుకోసం కార్యాచరణ ప్రణాళికను రాజకీయ పార్టీలతో చర్చించి నిర్ణయిస్తాం. ఈ నెలాఖరులోగా సమావేశం నిర్వహించనున్నాం. నవంబర్ ఒకటిన మానవహక్కుల రోజుగా పాటించాలని నిర్ణయించాం. వారానికి ఒక రోజు పోలీసులు గ్రామల్లోకి వెళతారు.

సమస్య మూలాన్ని ప్రభుత్వం గుర్తించిందా?

దీనిపై ప్రభుత్వానికి పూర్తి స్థాయి అవగాహన ఉంది. భూసంస్కరణలు పకడ్బందీగా అమలు చేయడమే దీనికి పరిష్కారమని భావిస్తున్నాం. దళితుల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మారాలి. మిగులు భూములను పంపిణీ చేయాల్సి ఉంది.

చాలా కేసుల్లో దళితులకు పోలీస్‌స్టేషన్లలో న్యాయం జరగడం లేదు కదా?

నిజమే. పోలీసుల వైఖరిలో చాలా మార్పు రావలసిన అవసరం ఉంది. ఈ సమస్యపై పోలీసులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నాం. పోలీసుల పనితీరుపై కూడా మేం సమీక్ష చేశాం. వారి ప్రవర్తన, ఆలోచనలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. కేసులు నమోదు చేసిన తర్వాత శిక్షలు అతి తక్కువ కేసుల్లో పడుతున్నాయి. చాలా కేసుల్లో కోర్టు బయటే రాజీ చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ప్రకటనలు నమ్మితే మోసపోవడం ఖాయం

బి.వి. రాఘవులు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి

పున్నయ్య కమిషన్ చేసిన అనేక సిఫారసుల్లో వాస్తవానికి అధిక భాగం కొత్తవేమీ కాదు. గతంలో వివిధ సందర్భాల్లో వచ్చిన సూచనల్లోనూ, చట్టాల్లోనూ ఇవి ఉన్నాయి. కాకపోతే వాటన్నింటినీ క్రోడీకరించి పున్నయ్య కమిషన్ సూచనలు చేయడం మంచిదే. అసలు విషయమేమంటే గతం నుండీ వస్తున్న సూచనలు, చట్టాలను అమలు జరపని ప్రభుత్వాలు ఇప్పుడు అమలు జరుపుతామని ప్రకటించినంత మాత్రాన నమ్మలేము. రాష్ట్రంలో ఇప్పటికీ అస్పృశ్యత, కుల వివక్షత ఎంత వికృతంగా, ఎంత విస్తృతంగా ఉందో కళ్లకు కట్టినట్లు పున్నయ్య కమిషన్ నివేదిక సోదాహరణంగా స్పష్టం చేసింది. మన దేశంలో కుల వివక్షత దాదాపు నిర్మూలించబడిందని, కానీ కొంత మంది అతిశయోక్తులు చెపుతున్నారంటూ డర్బన్ సదస్సులో సాక్షాత్తూ విదేశాంగ శాఖ ఉప మంత్రి ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ఈ నేపథ్యంలో పున్నయ్య కమిషన్ నివేదికను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తే వారికి కనువిప్పు కలుగుతుంది. అనేక సిఫారసులు, సమస్యపై విశ్లేషణలు చేసిన పున్నయ్య కమిషన్ నివేదికలో భూ సంబంధాల సమస్యకు తగినంత ప్రాధాన్యత ఇవ్వలేదు. విశ్లేషణల్లో భూ సమస్యను ప్రస్తావనగానే ఉంచారు. కుల వివక్షత నిర్మూలనకు, భూ సంస్కరణల అమలుకు చాలా కీలక సంబంధం ఉంది. అటువంటి మౌలిక అంశానికి తగినంత ప్రాధాన్యతతో పేర్కొనకపోవడం మొత్తం నివేదికలోనే ఒక తీవ్ర బలహీనత. కుల వివక్షత, అంటరానితనం నిర్మూలనకు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడటం వల్ల ఉపయోగం లేదు. కుల వివక్షత నిర్మూలన కోరుకునే అన్ని శక్తులూ కృషి చేయడం, కలిసి ఆందోళన సాగించడం అనేది కీలకమైన కర్తవ్యం.

దళితుల పరిస్థితి కడు దయనీయం

కె.ఎస్.ఆర్.మూర్తి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి

రాష్ట్రంలో దళితుల పరిస్థితి హీనాతిహీనంగా ఉందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి కె.ఎస్.ఆర్.మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను మాజీ ఛీఫ్ సెక్రటరీని. మాజీ ఎంపిని. నా కులం పేరు చెప్పుకొంటే రాజధానిలోనే ఇళ్లు అద్దెకు దొరకడం కష్టం' అన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో కేవలం ఐదు శాతం నిందితులే దోషులుగా తేలుతున్నారు. ఆ వర్గాలకు చెందిన పిల్లలకు కనీసం పుస్తకాలు, సబ్బులు కూడా వసతి గృహాల్లో అందడం లేదని తెలిపారు. ఈ వివక్ష ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల్లో కూడా ఉందన్నారు. దళితుల అభ్యున్నతి దిశలో జస్టిస్ పున్నయ్య చేసిన సిఫారసులు ప్రగతిశీలమైనవన్నారు. రాష్ట్రంలో దానిని తొలి అడుగుగా అభివర్ణించవచ్చు. సామాజిక ఆలోచనలో మౌలిక మార్పు రానిది ఎన్ని సిఫారసులు చేసినా పెద్దగా ప్రయోజనం ఒనగూరదని చెప్పారు. సిఫారసులు యథాతథంగా అమలుకు నోచుకొంటాయన్న నమ్మకం నాకు లేదు. ఇప్పటివరకు అనేక కమిషన్‌లు దళితుల అంశంపై సమర్పించిన నివేదిక ఏ ఒక్కటీ పార్లమెంట్‌లో చర్చకు నోచుకోలేదని అన్నారు. వారికి కల్పించే వెసులుబాటు పథకాలు అట్టడుగు స్థాయిదాకా పోతే తప్ప ఆశించిన ఫలితాలు రావు. దళితులకు బంజరు భూములు కాకుండా సాగు భూములు కేటాయించి ఆర్థికంగా ఆదుకొంటే వారి జీవనప్రమాణాల్లో ప్రగతి సాధించవచ్చునని తెలిపారు

రెండుగ్లాసుల విధానాన్ని పాటించినా పిసిఆర్ చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేయాలి. అటువంటి ఘటనలు జరిగితే తమంతట తామే రంగంలోకి దిగి చర్యలు తీసుకోవలసిన పోలీసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదు. దీనిపై ప్రజాప్రతినిధులు గళం విప్పలేదని పున్నయ్య వ్యాఖ్యానించారు. దళితులు, గిరిజనుల నుండి ఎన్నికైన అనేకమంది తమపదవులపై చూపిన ఆసక్తి ఈసమస్యపై కేంద్రీకరించలేదు. కనీసం నిరసనతెలిపిన ఉదంతం కూడా కనపడదు. సిపిఎం సభ్యులు అసెంబ్లీలో, వెలుపలా ఆందోళన చేసిన ఫలితమే పున్నయ్య కమిషన్ అన్నది అందరికీ తెలిసిందే. కులవివక్షకు వ్యతిరేకంగా కులవివక్షవ్యతిరేకపోరాట కమిటీ వేదికపైకి మాలమహానాడు, మాదిగరిజర్వేషన్ పోరాటసమితి కూడా రావలసి వచ్చింది.

పున్నయ్య కమిషన్ చేసిన సిఫార్సులను మొత్తంగా ప్రభుత్వం ఆమోదించటం అంటే పరోక్షంగా చట్టాలను అమలు జరపని తన వైఫల్యాన్ని ప్రభుత్వం అంగీకరించినట్లే . రాష్ట్రంలో అనేక నివేదికలు ఎన్నో మంచి సిఫార్సులు చేశాయి. వాటిని ప్రతి ప్రభుత్వం ఆమోదించింది. ఎక్కువ సిఫార్సులు అసెంబ్లీ లైబ్రరీలో, గోడౌన్లలో మూలుగుతున్నాయి. అందువలన పున్నయ్య కమిషన్ నివేదికకూ ఆ స్థితి రాకుండా చూడాల్సిన అవసరం ఉంది. ☆



డా|| రమేష్
జూనియర్ కన్సల్టెంట్ సర్జన్, నాగార్జున హాస్పటల్, విజయవాడ

రొమ్ము క్యాన్సర్ గుర్తించడమెలా?

సాధారణంగా స్త్రీలలో ఎక్కువ శాతం కనిపించే క్యాన్సర్ రొమ్ము క్యాన్సర్. 25 సంవత్సరాల లోపు వారికి ప్రతి లక్ష మందిలో ఐదుగురు స్త్రీలు, 50 సంవత్సరాల లోపు వారిలో 150 మంది స్త్రీలు, 75 సంవత్సరాల లోపు వారిలో 200 మంది స్త్రీలు ఈ వ్యాధికి గురవుతున్నారు. ఇందులో ఏటా 16 శాతం మంది స్త్రీలు చనిపోతున్నారు. అదే మగవారిలో ప్రతి లక్ష మందిలో ఇద్దరు ఈ క్యాన్సర్ వ్యాధికి గురవుతున్నారు.

ఎవరు ఎక్కువగా ఈ వ్యాధికి గురవుతున్నారో (రిస్క్ గ్రూప్) తెలుసుకొందాం

రిస్క్ గ్రూప్

1. 40 ఏళ్ళ పైబడ్డ స్త్రీలు.
2. కుటుంబంలో ఎవరికైనా రొమ్ము క్యాన్సర్ వుంటే
3. బిడ్డలు లేనివారు
4. పిల్లలకు పాలివ్వని తల్లులు.
5. త్వరగా రజస్వల అయినవారు
6. ఆలస్యంగా స్త్రీ ధర్మం ఉడిగినవారు

హైరిస్క్ గ్రూప్

1. ఒకే కుటుంబంలో ఇద్దరికి రొమ్ము క్యాన్సర్ వచ్చివుంటే లేదా ఒకరికి క్యాన్సర్ ప్రీమెనోపాసల్ వయసులో వచ్చివుంటే.
2. ఒక రొమ్ములో క్యాన్సర్ వచ్చిన వాళ్ళకు ఇంకో రొమ్ములో వచ్చే అవకాశము ఎక్కువ.

గుర్తించడం ఎలా?

1. రొమ్ములో గడ్డ.
2. సైజు, షేపులో మార్పు
3. చనుమొన నుంచి స్రావము.
4. మానని పుండు

వ్యాధి నిర్ధారణ :

రొమ్ములో కనపడ్డ ప్రతి గడ్డ క్యాన్సర్ కాకపోవచ్చు. కానీ అది నిర్ధారించేది వైద్యుడు. కొన్ని గడ్డలు పరీక్షానంతరంగాని క్యాన్సర్ అవునో కాదో చెప్పలేము. కొంతమందిలో కొన్ని పరీక్షలు చేసి నిర్ధారించవలసి వస్తుంది. వీటిలో ముఖ్యంగా మమ్మోగ్రామ్, ఎఫ్ఎన్ఏసి సూది పరీక్ష, బయాప్సీ. ఈ పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ జరిగిన తరువాత ఈ వ్యాధి శరీరంలో వేరే భాగాలకు వ్యాపించిందా లేదా అని నిర్ధారించడానికి ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్, కొన్ని సమయాలలో బోన్ స్కాన్ చేయవలసి వుంటుంది.

చికిత్స

ఈ వ్యాధి చికిత్స గురించి తెలుసుకొనే ముందు కొన్ని ముఖ్య విషయాలు గమనించాలి. కంటికి కనిపించే రొమ్ము కాన్సర్ కేవలం రొమ్ముకే కాకుండా ఇతర భాగాలకు సూక్ష్మ కణాల ద్వారా వ్యాప్తి చెంది వుండవచ్చు. కాబట్టి ఇతర చికిత్సా పద్ధతుల ద్వారా వ్యాప్తి చెందిన కణాలకు కూడా చికిత్స అవసరం.

ఎటువంటి చికిత్స :

- సర్జరీ
- కీమో థెరపీ
- హార్మోనల్ థెరపీ
- రేడియో థెరపీ

రొమ్ములో వుండే క్యాన్సర్‌ను సర్జరీ ద్వారా తొలగించవచ్చు. ఇతర భాగాలకు వ్యాపించిన క్యాన్సర్ కణాలకు కీమోథెరపీ లేదా హార్మోనల్ థెరపీ అవసరం అవుతుంది.

వ్యాధి పూర్తిగా నయం అవుతుందా?

ఇది పూర్తిగా వ్యాధి స్టేజ్‌పై ఆధారపడి



ఎముకల సాంద్రత రొమ్ము క్యాన్సర్‌కు సంకేతం

పెరిగిన ఎముకల సాంద్రత (బోన్ డెన్సిటీ) రొమ్ము క్యాన్సర్‌కు సంకేతం కావచ్చని పరిశోధనలో వెల్లడయింది. ఎముకల సాంద్రత ఎక్కువగా వున్న 65 సంవత్సరాల పైబడిన స్త్రీలలో క్యాన్సర్ రెండింతలు త్వరగా ఏర్పడవచ్చని వెల్లడయింది. 65 సంవత్సరాలు పైబడిన స్త్రీలలో రొమ్ము క్యాన్సర్ సంకేతాలు ఎంతవరకూ వున్నాయో తెలుసుకొనేందుకు బోన్ డెన్సిటీ టెస్ట్ ఉపయోగపడవచ్చు. అయితే ఈ టెస్ట్ ఖచ్చితత్వాన్ని గురించి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ టెస్ట్ చేయడానికి తొందర పడడం తగదని అమెరికన్ క్యాన్సర్ సొసైటీకి చెందిన డాక్టర్ కార్మన్ రొడ్రిగ్ అంటున్నారు. రొమ్ము క్యాన్సర్ సోకే అవకాశాలు తెలుసుకునేందుకు ఇంకా మంచి మార్గాలు వున్నాయని, 65 సంవత్సరాల కన్నా తక్కువ వయస్సు గల స్త్రీలకు ఈ పరీక్షలు జరపవచ్చో లేదో స్పష్టం కాలేదని ఆయన తెలియజేశారు.

వుంటుంది. వ్యాధి ప్రారంభ దశలో వున్న వారికి పైన తెలిపిన చికిత్సా విధానాల ద్వారా నయం చేయడానికి సాధ్యమవుతుంది. చికిత్సానంతరం రెగ్యులర్‌గా డాక్టర్ చెకప్ జరగాలి.

ప్రారంభదశలో కనుగొనడమెలా ?

రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభదశలో కనుగొనడం వీలవుతుంది. ఇందుకు స్త్రీలకు కొంత అవగాహన అవసరం. క్యాన్సర్ కణం 1 సెం.మీ. గడ్డ కావడానికి 1-20 సార్లు విభజన చెందుతుంది. చేతికి తగలాలంటే గడ్డ సైజు కనీసం 2 సెం.మీ. వరకు పెరగవలెను. సూక్ష్మ దశలో వున్న క్యాన్సర్‌ను మమ్మోగ్రామ్ ద్వారా కనుగొనవచ్చును.

పద్ధతులు

ప్రతి నెల ఎవరికి వారే పరీక్ష చేసుకొనే విధానము:

1. అద్దం ఎదురుగా నిలబడి నడుము వరకు దుస్తులు తొలగించండి. రొమ్ము చనుమొనల ఆకారం, సైజు, రంగు దిశలను జాగ్రత్తగా పరిశీలించండి.

2. రెండు చేతులు తలపైగా పెట్టుకోండి. ఇప్పుడు అటుపక్క నుండి ఇటు పక్కకు నిదానంగా చూస్తూ రొమ్ములను నిశితంగా పరిశీలించండి.

3. రెండు చేతులను వెనకకు పెట్టి నడుము మీద పెట్టుకొని గట్టిగా నొక్కుతూ భుజాలను ముందుకు వాల్చి ఒక్కొక్క రొమ్మును పరీక్షగా చూడండి.

4. కాలర్ ఎముక క్రింది భాగాన పరీక్షించండి.

5. చేతి మధ్య మూడు వేళ్ళను ఏదైనా బాడీ లోషన్ ఉపయోగించి గుండ్రంగా రుద్దుతూ రొమ్ము భాగాన్ని మొత్తం చనుమొనతో సహా పరీక్షించుకోండి. ఈ విధంగా రొమ్ము పక్క చేయి కిందవరకు పరీక్షించుకోండి. అదే విధంగా ఎడమ చేతిని ఉపయోగించి కుడి రొమ్మును పరీక్షించుకోండి.

6. పడుకొని ఒక చేతిని పైకెత్తి 6వ బొమ్మలో చూపిన విధంగానే రొమ్మును పరీక్షించుకోండి. చేతిని మార్చి మరొక చేతిపైకి ఉంచి ఇంకొక చేతితో మరొక రొమ్మును పరీక్షించుకోండి. ఈ విధంగా ప్రతి నెల మీరు పరీక్షించుకొని వివరాలు ఒక క్యాలండర్‌పై నోటు చేసుకోండి.

వైద్యునిచే పరీక్ష : 20-40 వయసుగల వారికి ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి, 40 సంవత్సరాలు పైబడిన వారికి సంవత్సరానికి ఒకసారి వైద్యునిచే పరీక్ష అవసరము.

మెమ్మోగ్రఫీ : మెమ్మోగ్రామ్ అనేది ఒక ప్రత్యేకమైన రొమ్ము ఎక్స్‌రే. సూక్ష్మ దశలో వున్న క్యాన్సర్‌ను మెమ్మోగ్రామ్ ద్వారా కనుగొనవచ్చు. ఈ ఎక్స్‌రే కంటికి కనపడని రొమ్ము క్యాన్సర్ కనుగొనడానికి, కనిపించే గడ్డ క్యాన్సర్ అవునో కాదో నిర్ధారించడానికి ఉపయోగపడుతుంది.

ఎవరికి ఈ మెమ్మోగ్రామ్ అవసరం :

35-40 సంవత్సరాల వయస్సు గల వారికి 'బేస్‌లైన్ మెమ్మోగ్రామ్', ఆ తర్వాత ప్రతి 2-3 సంవత్సరాలకు ఒకసారి ఈ మమ్మోగ్రామ్ చేయవలసి వుంటుంది.

50 సంవత్సరాల పైబడ్డవారికి ప్రతి సంవత్సరానికి ఒకసారి ఈ మెమ్మోగ్రామ్ చేసినచో కంటికి కనిపించని క్యాన్సర్ గుర్తించే అవకాశం వుంటుంది. ☆

నాకు సైనసైటిస్ ఉంది. ఇప్పటికి మూడుసార్లు ఆపరేషన్ జరిగింది. అయినా ఏమీ తగ్గలేదు. ఇది పూర్తిగా ఎలా తగ్గుతుందో తెలియచేయండి.

– బి.ఆంజనేయులు, పెదనెమిలి

అలెర్జీతో వచ్చిన సైనసైటిస్ దీర్ఘకాలం ఉంటుంది."పాలిప్"లు అనేవి కూడా తరచూ ఏర్పడతాయి. వీటిని ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ ద్వారా నయం చేయించుకోవాలి. ఈ శస్త్ర చికిత్సలో అనుభవం ఉన్న చెవి,ముక్కు, గొంతు వైద్యుడ్ని సంప్రదించండి.

నా వయస్సు **45** సం॥లు. నాకు గాల్‌బ్లాడర్‌లో రాళ్ళు వున్నాయి. సర్జరీ చేసి గాల్‌బ్లాడర్ తీసివేసి నెల అవుతోంది. దీనివలన భవిష్యత్‌లో ఏమైనా సమస్యలు తలెత్తుతాయా?

– ఎస్.కృష్ణమూర్తి, విశాఖ

ఈ శస్త్ర చికిత్స కారణంగా మీకు భవిష్యత్తులో సమస్యలు తలెత్తవు.

పదిహేను సం॥రాల క్రితం నా కుడిచేతి చూపుడువేలుకి గాయం అయ్యింది. గాయం పుండుగా మారి స్పర్శ కోల్పోయింది. గాయం మానాక వేలు కొంచెం పొడవు తగ్గింది. ఇప్పటి సమస్య ఏమిటంటే నా కదుపులో నుండి మెడవరకు కరెంట్ షాక్ కొట్టినట్లుగా జిమ్ అంటూ వస్తోంది. ఎటువైపు తిరిగి పడుకున్నా మెడనరాలు పట్టేస్తున్నాయి. డాక్టర్ నా కుడివేలు చూసి లెప్రసీ అన్నారు. మరికొందరు డాక్టర్లు కాదన్నారు. పెద్ద వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేదు. తగు పరిష్కారం చూపండి.

– జి.ఉరుకుందప్ప, చింతకుంట

లెప్రసీ వ్యాధి అవునో కాదో తేల్చేందుకుగాను ప్రతి జిల్లా కేంద్రంలోనూ ప్రభుత్వ శాఖ ఉంది. లేకుంటే చర్మవ్యాధుల వైద్యుడ్ని సంప్రదించండి. మెడలోని నరాలు ఒత్తుకున్నందున కరెంటు షాకు కొట్టినట్లుగా మీకు అనిపిస్తుండవచ్చు. ఎముకల వైద్యుడ్ని సంప్రదించండి.

– డా॥ కొల్లా నాగేశ్వరరావు,
ఎం.ఎస్. డి.ఎల్.ఓ., ఒంగోలు

మా అమ్మాయి వయస్సు **17** సం॥లు. నిద్రలో పండ్లు కొరుకుతోంది. ఎందువలన? పరిష్కారం చూపగలరు..

– టి.కె.ఆర్, వినుకొండ.

నిద్రలో పళ్ళుకొరకడమనేది మనస్సులో ఉన్న ఆందోళనకు చిహ్నం. ఆందోళన ఎందుకుందో పరిశీలించండి. దగ్గరలోని మానసిక వ్యాధుల నిపుణుని సంప్రదించండి.

నేను ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. ఒక వారం డే డ్యూటీ, మరో వారం నైట్ డ్యూటీ ఉంటుంది. డే డ్యూటీలో నేను మామూలు సమయాల్లోనే భోజనం చేస్తున్నాను. కానీ నైట్ డ్యూటీకి వచ్చేసరికి ఉదయం భోజనం మధ్యాహ్నం 2 గంటలకు, మధ్యాహ్న భోజనం సాయంత్రం 4 గంటలకు, రాత్రి భోజనం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు తింటున్నాను. ప్రస్తుతం నా ఆరోగ్యంలో ఎలాంటి మార్పులేదు. భవిష్యత్తులో ఏమైనా ఇబ్బంది ఉంటుందా?

– జక్కిమొద్దీన్, ఆలేరు

వేళకు భోజనం చేయడం మంచిది. కొన్ని పరిస్థితుల్లో వేళ తప్పి తిన్నప్పటికీ రోజూ అదే సమయంలో భోజనం చేయడం అవసరం. కొన్ని రోజులు ఒక రకంగా, మరోకొన్ని రోజులు ఇంకో రకంగా భోజనం చేయడంవల్ల శరీరంక్రమంతప్పి దానికి అనుగుణంగా సర్దుబాటు చేసుకోలేదు. జీర్ణాశయానికి సంబంధించిన వ్యాధులకు గురికావాల్సి వస్తుంది. ఇప్పటి వరకూ ఏమీ లేదు కాబట్టి మంచిదే. ఇకముందు సమయాన్ని పాటించండి.

డాక్టర్ ఎం.వి. రమణయ్య, ఎంబిబిఎస్.
దాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు


లాడెన్‌ని పట్టుకోవాల్సిందే ఏ సహాయం కావాలన్నా మొహమాటపడకండి!
...పనిలో పని ఈ చిన్న సాయం చేసి పుణ్యం కట్టుకోండి!!
కాశ్మీర్ ఉగ్రవాదం


లెక్క పెట్టుకోవాలిగాని.. ఇలాంటివెన్నో.. మనముందున్నాయి తమ్ముడూ..
ప్రైవేటీకరణ సంస్కరణలు
నిరుద్యోగం
అప్పులు
అవినీతి
అభివృద్ధిలో మనమే ముందున్నాం —బాబు
GANGA DHAR


ధైర్యే సాహసే 'డాలర్' బ్రదర్ !!
VOTE FOR WAR
యుద్ధ వ్యతిరేకత
యుద్ధ వ్యతిరేకత

ఉచ్చు



అల్పుడని తృణీకరించిన వాడు అనూహ్య తూణీరమై
విర్రవీగే బలవంతుడి ఆత్మగౌరవాన్ని గాయపరిస్తే
ఊరు మొత్తానికీ ఊరుకోలేనంత సందడి--
ప్రతీకార ప్రతిజ్ఞ ప్రగల్భమవుతుందో?
శత్రువుని వెతికిపట్టుకొంటుందో?
అది సజీవంగానో - నిర్జీవంగానో ?

ఛానళ్ళని కళ్ళుగా కట్టుకొన్న కుతూహలాల్లోకి
మనమూ ప్రవహించి సంతాప స్తంభాలమై పోతున్నాం
అదీ అసంకల్పితంగానే!

మన కంచంలో మెతుకులు విదిల్చి చితుకుల్లో కల్సిపోతున్న
మట్టిచేతుల కోసం సామూహిక మౌనాన్నెప్పుడైనా పాటించామా మనం!
తల్లిదండ్రుల రెక్కల చాటునుంచీ బిడ్డల్ని కోడిపిల్లల్లా
ఎగదన్నుకుపోతున్న గద్దగోళ్ళని ముద్దుపేరుతో
ఎలా పిల్చుకోగలుగుతున్నాం మనం!
గుండెనుండీ గుండెని వేరు చేసి ఆకాశంలో గాలి పటాలుగా ఎగరేసి
ఇంటర్నెట్లోంచీ రెట్టలై రాలుతున్న వాంఛల్ని మూటకట్టుకొంటున్న వాడ్ని
ఏభై నాలుగంతస్తుల మన స్వాతంత్ర్య స్వప్నాన్ని కూల్చేసిన వాడ్ని
మన ఆయువు పట్టుమీద ఆయుధమై లంఘించిన వాడ్ని
మన విత్తనాల్నే, మన విజ్ఞానాల్నే హైజాక్ చేసి మన మీదికే పేటెంట్లుగా ప్రయోగిస్తున్న వాడ్ని
ఏమీ చేయలేకపోతున్నాం..
ఎన్నెన్ని హిరణ్యాక్ష రూపాలతోనో ఎన్నో ఏళ్ళుగా మన ఎదురుగానే సంచరిస్తున్నా!
మనసంప్రదాయాల్ని, మన సరదాల్ని మందుకూరి పేల్చేస్తున్న వాడి నియంతృత్వాన్ని
మన సంస్కృతిని, మన సాహిత్యాన్ని హత్య చేస్తున్న వాడి ఉన్మాదాన్ని
ఉగ్రవాదంగా ఉప్ప పాతరెయ్యక
అగ్రవాదంగా భుజాలకెత్తుకొని భయంతోనో భక్తితోనో భజిస్తున్నంతకాలం
మనం వాడి అక్రమ సంతకాల సంకెళ్ళలో సజీవ కంకాళాలుగానే మిగిలిపోతుంటాం!!

(అలీన సిద్ధాంతానికి విరుద్ధంగా అమెరికాని సమర్ధిస్తున్న ప్రభుత్వ చర్యని నిరసిస్తూ)

- సుదేరా

మూగభాష

అమ్మా మా అమ్మా
మన్నించమ్మ
కనకమ్మ నన్ను కనకమ్మ
కంటే - అమ్మో
కుక్కలీడ్చుకుపోతాయ్
చెత్తకుండీలు ముద్దెట్టుకుంటాయ్
అందరు చూస్తారు
ముక్కున వేలేసుకుంటారు
ఏదీ ఆగదు ఎవరూ ఆగరు
పేపర్ల వేస్తరు - కాసులిస్తరు

బతుకుతే చంపుతారు
అందుకే కనకమ్మా కనకు
ఈ దేశంల నువ్వొక ఆటబొమ్మవి
బంగారు బాతు గుడ్డువి
వ్యవస్థ మారాలా
అవస్థ పోవాలా
సమసమాజము రావాలా
త్యాగాలు రాగాలు కావాలా
అందాకా కనకమ్మ నా కనకపు బొమ్మ
మన్నించమ్మ

- వెలువలి సత్యనారాయణ

బాలవికాసం

పిల్లల చేత ఎలాంటి పుస్తకాలు చదివించాలి?

పెండెం జగదీశ్వర్

వినయ్ తెలివైన కుర్రాడు. చదువులో ఫస్టు ర్యాంకులో ఉంటాడు. తనకొచ్చే సందేహాలకు ఎప్పటికప్పుడు టీచర్ల ద్వారా సమాధానాలు తెలుసుకుంటాడు. వివిధ విషయాల పట్ల అతనికున్న జిజ్ఞాసకు అందరూ అబ్బురపడేవారు. ఈ కారణాల దృష్ట్యా వినయ్ పట్ల నాకు ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది. ఓ రోజు వినయ్‌ని పిలిచి పిల్లల కోసం ప్రచురించబడుతున్న ఒక సైన్స్ మాసపత్రికను ఇచ్చి చదివాక తిరిగి ఇవ్వమన్నాను. ఆ పుస్తకంలోని విషయాలు వినయ్‌ని ఆసక్తిగా చదివిస్తాయని, అతని బుద్ధికి పదును పెడతామని భావించాను.

నాలుగు రోజులు గడిచాక "వినయ్ పుస్తకం చదివావా? ఎలా ఉంది? అనడిగాడు. అందుకు వినయ్ 'లేదు సార్!' అన్నాడు. 'ఏందుకు' అనడిగాన్నేను. 'మా డాడీ చదవొద్దన్నారు. వీటి బదులుగా నీ క్లాసు పుస్తకాలు చదువుకో అన్నారు' అని చెప్పాడు వినయ్. అతని మాటలు వినేసరికి కొంత ఆశ్చర్యం, కొంత బాధ కలిగాయి నాకు. పిల్లలు ఇతర పుస్తకాలు చదివితే స్కూలు చదువులో వెనకబడతారని భావించే సంకుచిత మనస్తత్వాలున్న తల్లిదండ్రులు చాలా మంది కనిపిస్తారు. ప్రపంచమంతా పాఠ్యపుస్తకాల్లోనే ఉందని రాత్రింబవళ్లు వాటితో కుస్తీ పట్టించి పరీక్షలు రాయిస్తున్నారు. జీవితానికి ఉపయుక్తమయ్యే అంశాలు అన్నీ పాఠ్యపుస్తకాల్లో లభ్యం కావని, పిల్లలకు పాఠ్య పుస్తకాల్లోని విషయాలే కాక, లోకజ్ఞానాన్ని, బుద్ధి వికాసాన్ని కలిగించే అంశాలు కూడా పరిచయం చేయాల్సి ఉందని, ఇవన్నీ అనేక ఇతర పుస్తకాల్లో లభ్యం అవుతాయని చాలామంది గుర్తించకపోవడం దురదృష్టకరమైన విషయం.

వినయ్ తండ్రిలాగా ఆలోచించే వాళ్లలో ఉపాధ్యాయులు కూడా ఉండడం శోచనీయం. పాఠశాలల్లోని లైబ్రరీల్లో వందలాది పుస్తకాలు జీర్ణమైపోతున్నా వాటిని పిల్లల చేత చదివించాలన్న ఆలోచన చాలా మంది ఉపాధ్యాయుల్లో కొరవడింది. స్కూల్లో ఉన్నంత సేపు ఊపిరి సలపనీయకుండా వారి మెదళ్ళలో చదువును కుక్కేసి కనీసం ఇంటి దగ్గరైనా ఖాళీ సమయం చిక్కనీయకుండా పేజీల కొద్దీ హోంవర్క్ లిచ్చి 'శిక్ష'ణనిస్తున్నారు. చదువుల పోటీ ప్రపంచంలో ఇది అందరికీ అలవాటైపోయినప్పటికీ ఈ పరిణామం సమంజసమైనది కాదు.

పిల్లల చేత వారి కోసం ఉద్దేశించిన సాహిత్యాన్ని చదివించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ బాధ్యతను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఏకకాలంలో నిర్వర్తించాలి. బాలల కోసం వెలువడుతున్న వివిధ బాలల పత్రికలను ప్రతినెలా తెప్పించి పిల్లల చేత చదివించాలి. ఇందువల్ల వారిలో భాషమీద అవగాహన, ఆలోచనా శక్తి పెంపొందుతాయి. అంతేకాక వాళ్ళు కవులుగా, రచయితలుగా రూపొందడానికి మంచి పుస్తకాలు దోహదపడతాయి.

పిల్లల చేత చదివించే పుస్తకాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. మనం ఎటువంటి సాహిత్యాన్ని చదివిస్తున్నామో శ్రద్ధగా పరిశీలించాలి. పెద్దవాళ్ళ కోసం ప్రచురించబడుతున్న వీక్లీలు, మాసపత్రికల్లో వచ్చే కొన్ని అంశాలు పిల్లల మీద దుష్ప్రభావాన్ని చూపుతాయి. నవలలు, కథల్లోని హింసాత్మకమైన, శృంగారపరమైన వర్ణనలు పిల్లల లేత మెదళ్ళమీద బలమైన చెడు ముద్ర వేస్తాయి. అందువల్ల ఇలాంటి పుస్తకాలు పిల్లల దరిదాపుల్లోకి రాకుండా జాగ్రత్త పడాలి. పెద్దవాళ్లు తమ కోసం తెచ్చుకున్న పుస్తకాల్ని పిల్లల చేతుల్లో పడకుండా చూసుకోవాలి.

మహనీయుల జీవిత చరిత్రలు, బుద్ధి వికాసానికి తోడ్పడేవి, వైజ్ఞానిక విశేషాల్ని తెలియజేసేవి, మానసికోల్లాసాన్ని, వినోదాన్ని కలిగించే పుస్తకాల్ని ఎక్కువగా చదివించాలి. గొప్పవారి జీవిత చరిత్రలు చదివినపుడు తాము కూడా వాళ్ళంతగా ఎదగాలని పిల్లలు ఆలోచిస్తుంటారు. మహాత్ములు అనుసరించిన మార్గంలోని కొన్ని నీతి నియమాల్ని పుణికి పుచ్చుకుంటారు. నిజాయితీ, సహన శీలత, పట్టుదల, సేవా దృక్పథం, ప్రేమ, త్యాగం తదితర సుగుణాలన్నీ పిల్లలకు అలవడుతాయి.

పిల్లల చేత చదివించే పుస్తకాలలో ప్రధానంగా వాస్తవికత ఉండేలా చూడాలి. మనిషి స్వతంత్రుడని, అతను ఎవరికీ విధేయుడు కాదని, ఎవరికింద బానిస కాదని, మనిషి మంచీ చెడులకు మనిషే కారణమని ప్రబోధించే సాహిత్యాన్ని ఆదరించి చదివించాలి. అంతేగాని బాలల మనసుల్లో భయాన్ని నింపేవి, మూఢ నమ్మకాలను పెంచిపోషించేవి, ఉనికిలో లేని శక్తుల ముందు మానవుడు నిర్వీర్యుడని చెప్పే పుస్తకాలను పఠనానికి దూరం చేయాలి. తమలో అపారమైన మేధస్సు, శక్తి సామర్థ్యాలు వున్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలమన్న నమ్మకాన్ని పిల్లల్లో కలిగించే పుస్తకాలే కావాలి. ఈ తరహా పుస్తకాలనే విరివిగా చదివించాలి.

నిత్య జీవితంలో తల్లిదండ్రులు తమ పనులు తమకున్నాయి అంటూ తప్పించుకోకుండా పిల్లల చేత మంచి మంచి పుస్తకాలు చదివించే బాధ్యతను తప్పనిసరిగా నిర్వర్తించాలి. తమకు వీలైనప్పుడల్లా పిల్లల్ని తమ వెంట లైబ్రరీకి తీసుకువెళ్ళాలి. అర్థం కాని విషయాలను విడమర్చి చెప్పాలి. తమ ఆదాయంలో కొంత భాగాన్ని పిల్లల పుస్తకాల కొనుగోలుకు కేటాయించాలి. అస్తమానూ టెలివిజన్ ముందు కూర్చుని పనికిరాని కార్యక్రమాలను చూడ్డం వల్ల కలిగే అనర్థాలను పిల్లలకు వివరిస్తూ అదే సమయంలో పుస్తకాలు చదవడం వల్ల కలిగే లాభాల్ని వివరించాలి. పుస్తక పఠనం పట్ల అభిరుచిని పెంపొందింపజేయాలి. మంచి పుస్తకాల్ని మించిన మిత్రుడు లేడన్న సూక్తిని పిల్లలు గుర్తెరిగేలా చేయాలి. ☆



'పుస్తకం విలువ'

అవంతీదేశపు మహారాజు విక్రమసేనుడు కొలువుతీరి ఉన్నాడు. సామంతులు, మంత్రులు, సైనికాధికారులు ఎవరిస్థానాల్లో వారు కూర్చొని ఉన్నారు. విక్రమసేనుడు సభా ప్రాంగణాన్ని నిశితంగా గమనించి..

'మహామంత్రి! ఈరోజు విచారించవలసిన నేరాలు ఏమైనా ఉన్నాయా?' అని ప్రశ్నించాడు.

'లేకేం మహారాజా ! ఉన్నాయి. ఇద్దరు చిన్నారులు ఓ చారిత్రక గ్రంథాన్ని దొంగిలించారు. వారిని ప్రవేశపెట్టమంటారా?' అడిగాడు మంత్రి.

ప్రవేశపెట్టండని రాజు ఆజ్ఞాపించగానే ఇద్దరు చిన్నారులు సభాప్రాంగణంలోకి అడుగుపెట్టారు.

విక్రమసేనుడు వారిని చూస్తూనే 'మీరు దొంగతనం చేశారని అంగీకరిస్తున్నారా?' అని ప్రశ్నించాడు.

'అంగీకరిస్తున్నాం మహారాజా!' అన్నారు ఆ చిన్నారులిద్దరూ ముక్తకంఠంతో.

'ఎవరైనా బంగారు వస్తువులు గానీ, ధనం గాని దొంగిలిస్తారు. కానీ మీరు ఓ పుస్తకాన్ని ఎందుకు దొంగలించారో కారణం 'తెలుసుకోవచ్చా' అని ప్రశ్నించాడు విక్రమసేనుడు.

'మహారాజా! వస్తువులు, ధనం ఆనందాన్ని కలిగిస్తాయి. తాత్కాలిక సంతోషాన్నిస్తాయి. కాని ఓ పుస్తకం ఎన్నో విషయాలు తెలియచేస్తుంది. ఎంతో జ్ఞానాన్నిస్తుంది. మనం నడిచిన దారి ఎలాంటిదో మనకు గుర్తు చేస్తుంది.

సరే ఇక దొంగతనమంటారా ! ఓసారి మీ కొలువులో పనిచేసే ఉద్యోగి ఇంటికి వెళ్ళాం. అక్కడ ఓ పుస్తకం కనిపించింది. మా తమ్ముడు ఓసారి చదివి ఇస్తాం. ఆ పుస్తకం కావాలని అడిగాడు. అందుకు ఆ ఉద్యోగి అంగీకరించలేదు. ఇక తప్పనిసరి స్థితిలో దొంగతనం చేశాం. దీనికి మీరు ఏ శిక్ష వేసినా శిరసావహిస్తాం' అన్నాడు వారిలో ఓ చిన్నారి.

'మంత్రివర్యా! ఈ చిన్నారులకు ఏ శిక్ష విధిద్దాం' అని అడిగాడు విక్రమసేనుడు.

'ఆరేళ్ళ కారాగారం విధిస్తే సరి' అన్నాడు మంత్రి.

'శభాష్, మంత్రివర్యా శభాష్. ఆ శిక్ష ముందు మీకు అమలు చేయాలి. ఎందుకంటే మన రాజ్య వ్యాప్తంగా జూద గృహాలు, మద్యం దుకాణాలు ఉన్నాయి తప్ప విజ్ఞానాన్నందించేందుకు ఓ పుస్తకాలయం కూడా లేదు. ఈ చిన్నారులు నా కళ్ళు తెరిపించారు. ఇక రాజ్యమంతా పుస్తక పఠన కేంద్రాలు ఏర్పాటు చేయండి' అని ఆజ్ఞాపించాడు.

నేరం చేసినా తన దృష్టికి ఓ సమస్యను తీసుకువచ్చినందుకు గాను ఆ చిన్నారులను క్షమించి వారికి బహుమతి ఇచ్చి పంపాడు విక్రమసేనుడు.

-అరసవిల్లి కృష్ణ

కథలు పంపండి

నేస్తాలూ,

మీరు ఏమైనా కథలు రాస్తే వాటిని ఈ శీర్షికకు పంపండి. బాగున్న వాటిని వీలు వెంబడి ప్రచురిస్తాం. మీరు పంపే కథలు విజ్ఞానం అందించేవి గాను, మంచి విషయాలు బోధించేవి గాను ఉండాలి. ఇప్పటికే వచ్చిన కథలు కాకుండా మీరు సొంతంగా రాసిన కథలు పంపండి. మీ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చూపించి వారి సంతకంతో పంపితే ప్రచురిస్తాం.





'రంగులు వేయండి'

కలంస్నేహం

పేరు: వనం మత్స్యగిరి

వయస్సు: 11

చదువు: 6వ తరగతి

హాబీలు: క్రికెట్ ఆడటం

పూర్తి చిరునామా: కేరాఫ్ మైత్రీ విద్యాలయం, గ్రామం : వెల్లంకి, మండలం : రామన్నపేట, జిల్లా : నల్లగొండ-508113

పేరు: మజ్హర్ హుస్సేన్

వయస్సు: 11

చదువు: 6వ తరగతి

హాబీలు: చెస్, క్రికెట్ ఆడటం, పుస్తకాలు చదవడం, బొమ్మలు గీయడం

పూర్తి చిరునామా: ఇ. నెం : 1-66, మారుతీనగర్ వీధి, పోస్టు : జడ్చర్ల, మండలం : జడ్చర్ల, జిల్లా : మహబూబ్‌నగర్-509302. ఫోన్ నెం : 08542-33965

పేరు: కె. శ్రీకాంత్

వయస్సు: 12

చదువు: 7వ తరగతి

హాబీలు: టీవీ చూడటం, కథలు చదవడం

పూర్తి చిరునామా: సన్నాఫ్ కె.నరేందర్, గ్రామం : రాజిపేట్, మండలం : కౌడిపల్లి, జిల్లా : మెదక్-502316

మాటలకోట - 29

1	✿	2		3	✿	4	5	
	✿		✿	6	7	✿		✿
8			✿	✿		✿	9	10
✿	✿	✿	11			✿	✿	
12	13	✿	✿	✿		✿	✿	
✿		✿	14		✿	15		✿
16		✿		✿	✿		✿	17
	✿	18			✿		✿	
19			✿	✿	20	✿	✿	
	✿	✿	21			✿	22	

అడ్డం

2. పంపకం, పంపిణీ (3)
4. జరిమానా..1,3,4 (4)
6. ఆలయం (2)
8. తరంగాలు...ఒకటే (3)
9. 'రా'తో మొదలయ్యే ఓ చెట్టు (2)
11. తండ్రి సోదరి (3)
12. శబ్దం (2)
14. చర్మం (2)
15. చివరి (2)
16. స్త్రీ (2)
18. బాలికకు వ్యతిరేకం (3)
19. ఈ పువ్వంటే నెప్రూతో సహా అందరికీ ఇష్టమే (3)
21. సాగరమథనంలో చివరికి పుట్టింది (3)
22. ఇచ్చేయడం (2)

నిలువు

1. కొత్తదనం (3)
2. ఉగాదినాడు ఈ పఠనం జరుగుతుంది (3)
3. కలర్ (2)
5. అతన్ని మీతో రమ్మని పిలవండి (3)
7. తలకిందులైన కొత్తబిడి (4)
10. బస (3)
13. ఒక నది (3)
14. ప్రపంచబ్యాంకు అధ్యక్షుడి పేరులో ఒక జంతువు (3)
15. జలుబు చేస్తే వచ్చేవి., తు..తు..తు (3)
16. ఇంటిగుట్టు రట్టు చేసే చిరంజీవి సినిమా (4)
17. జవాబు (4)
18. ఓ ప్రముఖ హిందీ సినిమా (2)
20. మొత్తం (2)

గత వారం జవాబులు

మాటలకోట-28

అడ్డం : 1.విదియ 2. గగనం 4. పొగ 6. మిద్దె 7. దర్జీ 8. గంజాయి 10. ధనం 11. నగ 12. ప్రమాద 16. అద్దం 17. గారాబం 19. కలంతో 21. రన్ 22. కలపా 25. పాలకులు 27. మునక 28. సీ 29. కప్పు 30. పంకం 31. అరకు

నిలువు : 1. విహంగం 2. గద్దె 3. నందనం 5. గమపద 9. జామ 13. మార్జాలం 14. మణిరత్నం 15. పాగా 18. బంక 20. తోకలు 23. పాపా 24. పంకజం 26. కునుకు 27. ముప్పు

'నాకు నచ్చిన ప్రదేశం'

చిన్నారి చిత్రకారులు



ఎం. శ్రీనాథ్, 4వ తరగతి
ఏకశిల హైస్కూల్, జనగాం

టి. ధనేష్, 7వతరగతి
ఠాగూర్ విద్యాలయం, వైరా

కె. సుజాత,9వ తరగతి
హరిపాలెం, విశాఖ జిల్లా

బి. సందీప్, 7వ తరగతి
మురళినగర్, విశాఖ-7

నేను మా కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్ళాను. అక్కడ మేం చార్మినార్, జంతుప్రదర్శనశాల, సాలార్‌జంగ్ మ్యూజియం, బిర్లామందిర్, బిర్లా ప్లానిటోరియం చూశాము. జంతు ప్రదర్శనశాలలోని పులులు, సింహాలు, కోతులు, చేపలు, రకరకాల పక్షులు, ఎలుగుబంట్లు, ఏనుగులు, నెమళ్ళు, మొసళ్ళు, తాబేళ్ళు, కుందేళ్ళు, జింకలు మొదలైన వాటిని చూశాము. సాలార్‌జంగ్ మ్యూజియంలో చిత్రపటాలు, రాజులకాలం నాటి యుద్ధ సామాగ్రి, వారు ఉపయోగించిన పరికరాలు, గంటలు కొట్టే గడియారం నాకు ఎంతో నచ్చాయి. బిర్లామందిరం పైనుండి చూస్తే హుస్సేన్‌సాగర్ దృశ్యం ఎంతో బాగుంటుంది.

-బి. యశ్వంత్, సుబ్బారావు ఎలిమెంటరీ స్కూల్, నరసాయపాలెం, బాపట్ల (మం), గుంటూరు (జి)

చేయండి ఇలా

పొటాటో జిరాఫీ



నేస్తాలూ, ఈ వారం మనం పొటాటోతో జిరాఫీని ఎలా తయారు చేయవచ్చో నేర్చుకుందాం.

మీకు కావాల్సినవి : మధ్యరకం పొటాటో, నల్లటి స్కెచ్‌పెన్ను, ఫెవికాల్, ఐదు ఐస్‌క్రీమ్ పుల్లలు, ఉన్నిదారం.

తయారు చేసే పద్ధతి : ఒక పేపరుపై జిరాఫీ ముఖ భాగాలను రెండు వైపులా గీయాలి. వాటిని కత్తిరించి ఒక ఐస్‌క్రీమ్ పుల్లకు చివరి భాగంలో అతికించాలి. ఆ తర్వాత మరో చివర కొంచెం ఫెవికాల్ రాసి పొటాటో ముందు భాగంలోకి గుచ్చాలి. మిగిలిన నాలుగు పుల్లలను కాళ్ళలాగా అమర్చాలి. ఉన్ని దారాన్ని తోకలాగ అల్లి పొటాటో వెనక భాగంలో అతికించాలి. నల్లటి స్కెచ్ పెన్‌తో పటంలో చూపినట్లు మచ్చలు, మచ్చలుగా పెయింట్ వేయాలి.

మీ ముందు పొటాటో జిరాఫీ సిద్ధంగా ఉంటుంది. వెంటనే మొదలుపెట్టండి మరి క్విక్...

మారణహోమాలు

అంపశయ్య నవీన్

"యుద్ధం వచ్చేటట్టే ఉంది. మూడో ప్రపంచ యుద్ధం వస్తుందని జనం ఎరితోకాలంగా అనుకుంటున్నారు. చివరకది నిజం కాబోతున్నది... ఈ యుద్ధంలో ఎంతమంది ఛస్తారో... అసలు ఈ భూమ్మీద మానవులంటూ ఎవరైనా మిగులుతారో లేదో చెప్పడం కష్టమే.." అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"నాక్కూడా యుద్ధం వచ్చేటట్టే కనిపిస్తున్నది. అది మూడో ప్రపంచ యుద్ధంగా మారుతుందో లేదో ఇప్పుడే చెప్పలేను గానీ మీకింకో విషయం చెప్పాలి..." అన్నాన్నేను.

"ఏమిటది?"

"యుద్ధాల్లోనే ఎక్కువ మంది చనిపోతారన్న అభిప్రాయమొకటి చాలా మందిలో ఉంది. యుద్ధాల్లో చాలామంది... కొన్ని కోట్లమంది చనిపోవడం నిజమే అయినా యుద్ధాలు లేనప్పుడు కూడా అనేక దేశాల్లో జరిగే అనేక మారణహోమాల్లో కూడా ప్రజలు చనిపోతూనే ఉంటారు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కాకముందే హిట్లర్ యూరపులో 60 లక్షల మంది యూదుల్ని, 15 లక్షల మంది జిప్సీలను చంపించాడు. ఇలాంటి మారణహోమాలు చరిత్రలో ఎన్ని జరిగాయో లెక్కలేదు. యుద్ధాల్లో చనిపోయిన వారికంటే ఇలాంటి మారణహోమాల్లో చనిపోయే ప్రజల సంఖ్యే ఎక్కువని విశ్లేషకులు తేల్చారు. చరిత్రలో 20వ శతాబ్దం ప్రారంభం వరకు జరిగిన యుద్ధాల్లో నాలుగు కోట్ల మంది ప్రజలు చనిపోతే అప్పటి వరకు మారణహోమాల్లో చనిపోయిన వారి సంఖ్య 13 కోట్ల 30 లక్షలని ఓ చరిత్రకారుడు అంచనా వేశాడు.

"అమ్మ బాబోయ్! ఇది చాలా ఆశ్చర్యంగా ఉందే! కానీ ఈ మారణ హోమాలెందుకు జరుగుతాయంటారు"

"ఈ భూమ్మీద అనేక జంతువులు జీవిస్తున్నాయి. జంతువుల్లో కనిపించే ఓ నీతి ఏమిటంటే ఒక జాతికి చెందిన జంతువుల్ని అదే జాతికి చెందిన జంతువులు చంపుకోవు. ఉదాహరణకి సింహాన్ని సింహం చంపదు. పెద్దపులిని పెద్దపులి చంపదు. కానీ 'హోమోసేపియన్' జాతికి చెందిన మనుషులనబడే జాతి మాత్రం తమ జాతికి చెందిన వాళ్ళను చంపుకుంటుంది. జంతువులన్నింట్లోను మన జాతికి చెందిన జంతువుల్ని చంపకూడదని శాసించే జన్యువొకటి (జీన్) ఉంటుందట... అలాంటి జన్యువును సృష్టి మనుషులనబడే వాళ్ళల్లో ప్రతిష్ఠించటం మరచిపోయినట్టుంది - అందుకే హోమోసేపియన్ జాతికి చెందిన మానవులనబడే జంతువులు తమను తామే హతమార్చుకుంటాయి. ఈ మానవులకు ఆలోచించే శక్తి ఉంది. కాబట్టి తమ తోటి వాళ్ళను చంపడానికి ఎన్నో కారణాలను కనిపెట్టారు. ఉదాహరణకి హిట్లర్ యూదుల్ని చంపడానికి చాలా కారణాలు కనిపెట్టాడు. వాళ్ళు స్వచ్ఛమైన ఆర్యజాతికి చెందిన వాళ్ళు కారని, వాళ్ళు జర్మనీ దేశానికి శత్రువులనీ, వాళ్ళవల్ల జర్మనీ దేశానికి పెద్ద ప్రమాదం జరగబోతున్నదని, కాబట్టి వాళ్ళను పూర్తిగా నాశనం చేస్తే తప్ప జర్మనీ అభివృద్ధి చెందదని ప్రచారం చేసి ప్రజల్ని నమ్మించాడు.. అలాగే పోల్‌పాట్.. కాంబోడియాలో ఉన్న మేధావుల్ని, మధ్యతరగతి వాళ్ళనీ వర్గ శత్రువులుగా ప్రకటించి వాళ్ళందర్నీ హతమారిస్తే తప్ప విప్లవం విజయవంతం కాదని లక్షల మందిని చంపించాడు. చివరకు 1979లో కాంబోడియా పక్కనే వున్న మరో కమ్యూనిస్టు దేశం వియత్నాం తన సేనల్ని కాంబోడియాలోకి పంపించాకే ఈ మారణహోమం ఆగిపోయింది. ఇంకా చరిత్రలో ఇలాంటి మారణహోమాలెన్నో జరిగాయి. 1221వ సంవత్సరంలో పర్షియాలోని "నిషాపూర్" అనే నగరాన్ని చెంఘిజ్‌ఖాన్ ముట్టడించినప్పుడు చెంఘిజ్‌ఖాన్ అల్లుణ్ణి ఎవరో బాణంతో చంపేశార్ట - అందుకు ప్రతీకారంగా చెంఘీజ్‌ఖాన్ నిషాపూర్‌ను వశం చేసుకున్న తర్వాత దాదాపు పదకొండు లక్షల మంది పర్షియన్లని చంపించాట్ట.. ఒక వ్యక్తిని చంపినందుకు ప్రతీకారంగా ఇంతమందిని చంపడం చరిత్రలో ఒక రికార్డుట! ప్రతీకార వాంఛే కాకుండా ఇంకా అనేక కారణాల వల్ల మారణహోమాలు జరుగుతాయి... కొలంబస్ అమెరికాను కనుగొన్న తర్వాత యూరపు నుండి లక్షల మంది యూరోపియన్లు అమెరికాలో స్థిరపడటానికి అక్కడికి వలస వెళ్ళారు. వీళ్ళకు అమెరికాలో మొదట్నించీ నివాసముంటున్న 'రెడ్‌ఇండియన్లు' శత్రువుల్లా కనిపించారు. ఈ రెడ్‌ఇండియన్లను యూరపు నుండి వెళ్ళిన అమెరికన్లు జంతువుల్ని వేటాడినట్టు వేటాడి లక్షల మందిని చంపేశారు... 1492లో అమెరికాలో 5 కోట్ల 5 లక్షల మంది రెడ్ ఇండియన్లు ఉండేవాళ్ళట. ఇప్పుడు అమెరికాలో రెండ్‌ఇండియన్లు ఒక కోటి మంది కూడా లేరట. అంటే దాదాపు నాలుగు కోట్ల మంది రెడ్ ఇండియన్లను యూరప్ నుండి వెళ్ళి వాళ్ళ దేశాన్ని ఆక్రమించుకున్న ఇప్పటి అమెరికన్లు చంపేశారన్నమాట!... ఇలాంటి స్వదేశీయుల మారణహోమం ఆస్ట్రేలియాలో కూడా జరిగింది. ఆస్ట్రేలియాలో ఇప్పుడుంటున్న శ్వేతజాతీయులందరూ ఇంగ్లాండ్ నుండో, ఇతర యూరప్ దేశాల నుండో వెళ్ళిన వాళ్ళే... వీళ్ళ కంటే ముందు ఆస్ట్రేలియాలో నాగరికత తెలీని ఎంతోమంది ఆదిమవాసులుండేవాళ్ళు... ఇంగ్లీషు వాళ్ళు 1788లో ఆస్ట్రేలియాకు వెళ్ళినప్పుడు అక్కడ 3 లక్షల మంది ఆదిమవాసులుండేవాళ్ళట - వాళ్ళ సంఖ్య 1921 నాటికి 60 వేలు కూడా లేదుట. అంటే రెండు లక్షలకు పైగా అక్కడ నివాసముంటున్న ఆదిమవాసుల్ని ఆస్ట్రేలియా ఖండానికి వలస వెళ్ళిన ఇంగ్లీషు వాళ్ళు చంపేశారన్నమాటే కదా... బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాల వాళ్ళు అభివృద్ధి చెందని ప్రాంతాలకు వలస వెళ్ళినప్పుడల్లా చరిత్రలో ఇలాంటి మారణహోమాలు ఎన్నో జరిగాయి. కాబట్టి చెప్పొచ్చేదేమిటంటే ఒక్క యుద్ధాల వల్లనే ప్రజలు చనిపోతారనుకోకూడదు.... స్వార్థం, పగ, ద్వేషం, అసహనం, ఈర్ష్య లాంటి విధ్వంసక శక్తులు మనిషిలో ఉన్నంతకాలం మనిషిని మనిషి చంపుకుంటూనే ఉంటాడు. ఇలాంటి మారణ హోమాలు జరుగుతూనే ఉంటాయి" అన్నాన్నేను. ☆

ఇంటి వాతావరణం

లక్ష్మి

వాతావరణం అనగానే మనకి ఎండా వానలు గుర్తుకొస్తాయి. ముసురూ, పెనుగాలులూ, తుఫాన్లు గుర్తుకొస్తాయి. వరద బీభత్సాలు గుర్తుకొస్తాయి. సృష్టికి సంబంధించిన ఈ గొడవని మనం వాతావరణమని పిలుస్తాం! ఇంటికి సంబంధించినంత వరకూ ప్రత్యేకంగా - ఒక వాతావరణం వుంటుంది. ఈ వాతావరణానిక్కూడా ఎండావానలుంటాయి. ముసురూ పెనుగాలులూ పెద్ద పెద్ద తుఫాన్లూ తగులుకుంటాయి. వరద బీభత్సాలు సరేసరి! కొంపమునుగుతుంది. ఇంటోచోటు చేసుకున్న అశాంతి స్థాయిని బట్టి ఇవి తగులుకుంటాయి! ఇంటిల్లిపాదీ సుఖంగా ఆరోగ్యంగా వున్నప్పుడు సదరు యింటి వాతావరణం ప్రశాంతంగా వుందంటాం. కేవలం సిరి సంపదలున్నంత మాత్రాన యింటి వాతావరణం భేషుగ్గా వుందని చెప్పడానికి వీల్లేదు. ఇంటో మనుషులు బుద్ధిగా ప్రవర్తించాలి. సిరిసంపదల కంటే విలువైనది సత్ప్రవర్తన. అది ముదనష్టంగా తగలడినప్పుడు ఎంత సిరి వున్నా ఎన్ని సంపదలున్నా నిష్ప్రయోజనమే అవుతాయి! మన తరంతో కథ పూర్తి కాదు. రేపటి తరం కూడా వుంది. ఆ మాట మరిచిపోకూడదు. ఆ తరం మంచి కోసం మనం యిప్పుడే పునాది వేయాలి!

మన పిల్లలు బుద్ధిగా పెరగాలంటే ముందు మనం బుద్ధిగా వుండాలి. మనం రవుడీలుగా తిరుగుతూ - మన పిల్లల్ని సుమతీ శతకం చదువుకుని బాగుపడమని చెప్పే హక్కు మనకెలాగూ లేదు. మనల్ని చూసి నేర్చుకునే దశలో - ఎంతవద్దనుకున్నా - మన ప్రభావం వాళ్లమీద తప్పకుండా పడుతుంది! ఈ సందర్భంగా ఒక పిట్ట కథ చెప్పుకోవాలి. ఒక పెద్దమనిషి తన దగ్గిరున్న రెండు చిలకల్నీ రెండిళ్లల్లో వుంచేట్ట. ఒక ఇల్లు మంచీ మర్యాదలకు నిలయం! రెండో ఇల్లు మొరటుతనానికి మచ్చు తునక! కొన్నాళ్లు గడిచింది. చిలకల్నిచ్చిన పెద్ద మనిషి - మొదట మర్యాదస్తుల యింటికి వెళ్లేట్ట. ఆయింటో వుంచిన చిలక ఆ పెద్దమనిషిని ఎంతో ఆదరంగా ఆహ్వానించిందిట. సీతారాం... రండి... కాళ్లుకడుక్కోండి... చల్లటి మజ్జిగ పుచ్చుకోండని ఆ పెద్దమనిషిని ఎంతో సంతోషపెట్టిందట. ఆ చిలక పలుకులకు ఆ పెద్ద మనిషి మురిసి ముగ్ధుడయ్యేట్ట! ఆ తర్వాత అతను రెండో యింటికి వెళ్లి తలుపు తట్టగానే - ఆ యింటోవున్న రెండో చిలక తలుపు శబ్దం విని - ఆశువుగా బూతులు ప్రయోగించడం ప్రారంభించిందట! ఎవడ్రానువ్వని బూతుతో అడిగి ఎందుకొచ్చేవని బూతుతోనే ప్రశ్నించిందిట! ఇంటో అడుగు పెట్టేవంటే నరుకుతానని అల్టిమేటమిచ్చిందిట!

చిలకలు రెండూ ఒక తల్లికే పుట్టాయి! చిలకలు రెండూ ఒకే రంగు, ఒకే రూపుతో వున్నాయి! కాకపోతే ఆ రెండు చిలకలూ వేర్వేరు చోట్ల బతుకుతూ, వేర్వేరు వాతావరణాలకు అలవాటు పడి, వేర్వేరు గుణాల్తో పెరిగి పెద్దవయ్యాయి. ఒక చిలక సీతారామని మర్యాదగా పలకరిస్తే - ఇంకో చిలక ఎవడ్రా నువ్వని బూతుపదం

వాడింది. కొన్ని నెలల వ్యవధిలోనే చిలకల వైఖరి యింత మహత్తరంగా మారిపోయినప్పుడు - పిల్లల గురించి వేరే చెప్పాలా? ఏళ్ల తరబడి యింటి వాతావరణాన్ని వంట బట్టించుకున్న కారణంగా - అట్లా కాదు ఇట్లా ప్రవర్తించమని సూక్తులు చెబితే వింటారా? అంచేత పిల్లలు బాగు పడినా, చెడిపోయినా - ఆ యింటి వాతావరణం ప్రధాన కారణంగా నిలుస్తుంది! విస్కీ బ్రాందీలు ఒళ్లు తెలీకుండా తాగి చిందులు తొక్కే తండ్రిని చూస్తున్న చిరంజీవి - మజ్జిగ మాత్రమే తాగవలెనని ప్రతిజ్ఞ ఎందుకు చేస్తాడు? నూటికీ కోటికీ ఒకడు - ప్రహ్లాదుడి టైపులో - తండ్రితో తాగొద్దని పేచీపడితే పడచ్చు. తప్పు జనకా తాక్కూడదని నీతి సూత్రం చెబితే చెప్పచ్చు. ఆ తండ్రికి కోపమొచ్చి నాలుగు పీకినా - తప్పు తండ్రీ అనే బాణీ నుంచి బయటపడకపోవచ్చు! అందరికీ ఈ అవకాశం ఎట్లా దొరుకుతుంది?

తల్లిదండ్రులేం చేస్తుంటే - పిల్లలు కూడా అదే చేస్తుంటారు. ప్రతి నిత్యం అమ్మానాన్నా కొట్టుకు ఛస్తున్నప్పుడు - పిల్లలు తెల్లపావురాలయ్యే ఛాన్సు తక్కువగా వుంటుంది! ఆ కొట్టుకోడం, తిట్టుకోడానికే అలవాడు పడతారు. అమ్మానాన్న ఆటల్లో కూడా కొట్టుకోడాలు తిట్టుకోడాలే చోటు చేసుకుంటాయి. ఇదేదో ఊసుపోక చెబుతున్నది కాదు. మొన్నామధ్య మా దొడ్డమ్మగారి కూతురు రేవతి మా యింటికి వచ్చింది. కంట తడిపెట్టుకుని సొంత కథ వినిపించింది. వాళ్లాయన గారికి వ్యసనాలు చాలా వున్నాయిట. సకల దుర్గుణ సంపన్నుడట. కనీసం పిల్లల మొహం చూసైనా వ్యసనాలకు చుక్క పెట్టమని రేవతి అనేక తడవలు ప్రాధేయపడినా ఫలితం కనిపించలేదుట. కనీసం ఇంటో తాక్కండని ప్రార్థిస్తే - నా ఇల్లూ నా యిష్టమంటాట్ట. పిల్లలు చూస్తే బావుండదని హెచ్చరిస్తే - పిల్ల వెధవలకి భయపడే చవట వెధవను కానంటాట్ట. విస్కీ తాగేప్పుడు వాళ్ల పెద్ద పిల్లవాడి చేత సోడాలూ సిగరెట్లూ తెప్పించుకుంటాట్ట! మీరు తెచ్చుకోవచ్చుగదాని అడిగితే - నా చేత్తో తాకిన సోడాలూ సిగరెట్లు రుచిగా వుండవని సూత్రం చెబ్తాట్ట!

సెలవు రోజుల్లో ఇంటిని క్లబ్బుగా మార్చేస్తాట్ట! కొలీగ్స్‌ని యింటికి పిల్చి వాళ్లతో తాగి, జూదం ఆడందే ఆ రోజు గడవదట. ఈ రభస పిల్లలు చూస్తే బావుండదనే ఉద్దేశంతో - పిల్లల్ని వేరే గదిలో తనతో పాటు కూచోబెట్టుకుంటే కళ్లెర్ర చేస్తాట్ట. వాళ్లని నీ దగ్గర కూచోబెట్టుకుంటే సిగరెట్లూ, సోడాలూ మీ అయ్య తీసుకొస్తాడాని అరుస్తాట్ట! ఈ కొలువు మీ కొలీగ్స్ ఇళ్లల్లో పెట్టుకోవచ్చుగదాని రేవతి సలహా యిస్తే - వాళ్లకి ఆ దమ్ముల్లేవని అంటాట్ట! దమ్ములున్న తనలాటి వీరమొనగాళ్లు ఆఫీసు మొత్తమ్మీద ముగ్గురంటే ముగ్గురే వున్నారని చెబ్తాట్ట! అందులో తానొకడని మిగతా యిద్దరికీ దమ్ములున్నాయేగాని వాళ్లు జూదం ఆడరుట! తాగుడికి దూరమట! అంచేత వాళ్ల ఇళ్లల్లో ఇల్లాంటి ప్రోగ్రాంలు పెట్టుకోడం బావుండదు గనక మనింటో ఏర్పాటు చేసేనని గర్వంగా చెబుతాట్ట! ఇదేం మనిషి? అది అహంకారమా? అజ్ఞానమా? అజ్ఞానమంటే అరుస్తాట్ట! అహంకారమంటే అది మా వంశంలో వున్న అలంకారమని మురిసిపోతాట్ట!

ఇల్లాంటి కొంపలు దేశంలో ఎన్ని వున్నాయో నాకు తెలీదు. ఆ కొంపలు నిత్యశోకంతో నిండి వుంటాయని మాత్రం కచ్చితంగా చెప్పగలను. శోకం అటుంచండి. ముందుతరాల మాటేమిటి? వాళ్లని మంచి మార్గంలో నడిపించవలసిన బాధ్యత విస్మరించడంతో పాటు - తమకి నమూనాలుగా తయారు చేసే తండ్రి మహాశయుడ్ని ఏమని పిలవాలి? పొగరుబోతనాలా? ముందుచూపులేని మూర్ఖుడని పిలవాలా? ☆

మనోల్లాసానికి మైసూర్ యాత్ర

లలితా మహల్

బృందావన్ గార్డెన్స్

వత్సల

పర్యటనల పట్ల ఆసక్తి వున్న వారెవరైనా తప్పక చూడదగిన ప్రదేశం మైసూర్. మైసూర్ మహారాజుల వైభవాన్ని తిలకించేందుకు వీలుగా అక్కడ రాజభవనాన్ని ఎంతో అద్భుతంగా నిర్వహిస్తున్నారు. కర్నాటకకు ఒక అపూర్వ ఆభరణంగా, చందనపు నగరంగా మైసూర్ విలసిల్లుతోంది. పర్యాటకుల పాలిటి స్వర్గంగా మైసూర్‌ను అభివర్ణించవచ్చు. మైసూర్‌లో ఉన్నన్ని దర్శనీయ స్థలాలు మరెక్కడా మనకు కన్పించవు. కనులు మిరుమిట్లు గొలిపే రాజభవనాలు, సుందరమైన ఉద్యానవనాలు, అద్భుతమైన మ్యూజియంలు, ఆర్టు గ్యాలరీలు, ఆనకట్టలు, రిజర్వాయర్లు, ఆలయాలు ఇక్కడ దర్శనమిస్తాయి.

దసరా దినాలలో మైసూర్‌ను తప్పకుండా చూసి తీరవలసిందే. దసరా ఉత్సవాల కోసం నగరాన్ని ప్రతి సంవత్సరం సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. ప్రతీ సంవత్సరం సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో 10 రోజుల పాటు చాలా అట్టహాసంగా ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా, ఆడంబరంగా జరుగుతాయి. ఇది భూమండలంలోనే గొప్ప ప్రదర్శనగా మిగులుతుంది.

మైసూరుకు సమీపంగా, వేగంగా వెళ్ళాలంటే బెంగుళూరు నుంచి బస్‌లో వెళ్ళవచ్చు. బెంగుళూరులో బస్ ఎక్కిన తరువాత మూడు గంటల్లో మనం మైసూర్‌లో వుంటాము. బెంగుళూరు నుంచి కొన్ని టూరిస్ట్ సంస్థలు కూడా పర్యటనలు ఏర్పాటు చేస్తుంటాయి. ఆ బస్‌లలో వెళ్తే శ్రీరంగం, బృందావన్ గార్డెన్స్‌తో పాటు మైసూరులోని దర్శనీయ స్థలాలన్నింటినీ చూపిస్తారు. బెంగుళూర్‌కు ఆగ్నేయాన 138 కి.మీ. దూరంలో, ఊటీకి 160 కి.మీ. దూరంలో, హసన్‌కు 121కి.మీ. దూరంలో మైసూర్ వుంది. సమీపంలోని విమానాశ్రయం బెంగుళూరు. పొరుగు రాష్ట్రాలైన కేరళ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గోవా, తమిళనాడు నుంచి అనేక ఎక్స్‌ప్రెస్ బస్‌లు వున్నాయి. ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఇక్కడకు వస్తాయి.

మైసూర్ వినీలాకాశాన్ని వెలుగుల జిలుగులతో నింపుతూ అద్భుతమైన వాస్తుకళతో రాజభవనం విరాజిల్లుతూ ఉంటుంది. ఈ భవన నిర్మాణంలో ద్రావిడ, ఇండో-సరాసెనిక్, ఓరియంటల్, రోమన్ కళల కలయిక మనకు గోచరిస్తుంది. పాతరాజభవనం తరచుగా అగ్ని ప్రమాదాలకు గురవుతుండటంతో 1912వ సంవత్సరంలో ఈ అత్యద్భుత భవనాన్ని నిర్మించారు. భవనం ముందు భాగంలో పెద్ద గుండ్రని స్తంభాలపై బహిరంగంగా వుండే బాల్కనీ వుంది. భవనం లోపలి భాగం ముఖ్యంగా దర్బార్ హాల్ చాలా సంపద్వంతంగా అలంకరించబడి వుంటుంది. చక్కటి అలంకరణలతో వున్న పైకప్పు, అందమైన నగిషీలతో వున్న తలుపులు. మెరుస్తూ వుండే ఫ్లోరింగ్ భాగం. గోడలపై వుంచిన రామాయణ, మహాభారత కథ చిత్రాలతో రాజభవనం మనోహరంగా వుంటుంది. వీటన్నింటినీ చూస్తే రాజవైభవం కళ్ళకు కడుతుంది. 200 కి.గ్రా. బంగారంతో తయారు చేసిన రాజసింహాసనాన్ని దసరా ఉత్సవాల సందర్భంగా ప్రదర్శిస్తారు.

రాజకుటుంబీకుల చిత్రాలతో వున్న ఆర్టు గ్యాలరీని సందర్శకుల కోసం తెరిచి వుంచుతారు. దసరా ఉత్సవాలు జరిగినన్ని రోజులూ రాజభవనం జగజ్జేగీయమానంగా వెలిగిపోతూ వుంటుంది. రాజభవన పరిసరాలలో రాష్ట్ర ఆర్కియోలాజికల్ విభాగం, కొన్ని ఆలయాలు వున్నాయి. రాజభవనాన్ని ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ తెరిచి వుంచుతారు. రాజభవనాన్ని సందర్శించాలంటే టికెట్ వుంటుంది.

రాజకుటుంబీకులు లలితా మహల్‌ను వేసవి కాలంలో ఉపయోగించే వారు. ఈ భవనాన్ని వున్నది వున్నట్లుగానే వుంచి ఒక విలాసవంతమైన హోటల్‌గా మార్చారు.

చాముండీకొండపై చాముండేశ్వరీదేవి ఆలయం వుంది. ఈ కొండపైకి కాలి నడకన వెళ్ళాలంటే వెయ్యి మెట్లు ఎక్కాలి. కొండపైకి బస్ సౌకర్యం వుంది. ఈ ఆలయ గోపురం ఏడంతస్తులుగా వుంటుంది. గోపురంపై చాముండీ దేవి వివిధ మనస్థితులలో మనకు దర్శనమిస్తుంది. సమీపంలో మహిషాసురమర్దిని విగ్రహం చాలా పెద్దది వుంది. కొండపైకి వెళ్ళే మార్గమధ్యంలో ఏకశిలతో చెక్కిన అద్భుతమైన నంది వుంది. దసరా వెళ్ళిన తరువాత కొద్ది రోజులకు జరిగే తెప్పోత్సవం కోసం అక్కడ ఒక సరస్సును కూడా ఏర్పాటు చేశారు.

శ్రీజయచామరాజేంద్ర ఆర్టు గ్యాలరీని గతంలో జగన్‌మోహన్ ప్యాలెస్ అనే వారు. ఇక్కడ చక్కటి ఆర్టు గ్యాలరీ వుంటుంది. భారతీయ చిత్రకళలోని వివిధ శైలులకు సంబంధించిన చిత్రాలు విశాలమైన హాలు గోడలపై అమర్చారు. ఇక్కడ రాజకుటుంబీకుల చిత్రాలు, పురాణ కథలను ప్రతిబింబించే చిత్రాలు, ప్రకృతి దృశ్యాలు, ప్రత్యేక అంశాలను ప్రతిబింబించే చిత్రాలు వుంటాయి. వాటిలో చెప్పుకోదగింది ప్రముఖ చిత్రకారుడు రవివర్మ చిత్రించిన 'ది లేడీ విత్ ది ల్యాంప్'. మైసూర్‌కు చెందిన చిత్రకారుల కోసం ప్రత్యేకంగా ఒక గ్యాలరీ వుంది. ఇక్కడ ప్రాచీన వాద్యపరికరాలు, చక్కటి నగిషీలతో వున్న ఫర్నిచర్, చందనం, దంతాలతో చేసిన బొమ్మలు కూడా ప్రదర్శిస్తారు. ఒకే బియ్యపు గింజపై చెక్కిన దశావతారాలు తప్పకుండా చూడదగినది. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ సందర్శకులను అనుమతిస్తారు.

మైసూర్ జూ 1995 అక్టోబర్‌లో శత జయంతి జరుపుకుంది. ఇక్కడ అనేక రకాలైన వన్యప్రాణులు, పక్షులు, పాములు వున్నాయి. దీనిని నగరంలోని అందమైన ఒక తోటలో నెలకొల్పారు. ఉదయం 7.30 గంటల నుంచి 12 గంటల వరకూ, 2.30 నుండి 6 గంటల వరకూ దీనిని సందర్శకుల కోసం తెరచి వుంచుతారు.

రాజభవనం సమీపంలో వున్న వాటితో కూడా కలుపుకొని నగరంలో దాదాపు 185 ఆలయాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి వరాహస్వామి, ప్రసన్నకృష్ణ స్వామి, త్రినేశ్వర, లక్ష్మీనారాయణస్వామి ఆలయాలు. న్యూ గోతిక్ వాస్తుకళతో భారతదేశంలో నిర్మించిన చర్చీలలో చాలా పెద్దదైన సెయింట్ ఫిలోమెనా చర్చి ఇక్కడ వుంది. ఇక్కడ అందరికీ అందుబాటులో వుండేలా అనేక హోటళ్ళు, రెస్టారెంట్లు వున్నాయి. ☆



మైసూర్ రాజభవనం

వ్యాయామంతో ఆరోగ్యం

మారేపల్లి లక్ష్మణ్

కాలంతో పోటీ పడుతున్న ఈ స్పీడ్ యుగంలో ఫిట్‌నెస్‌పై యువత నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎన్నో మానసిక, శారీరక రుగ్మతలను కొనితెచ్చుకొంటున్నది. పదికాలాల పాటు ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకునేందుకు వ్యాయామం తప్పనిసరి అన్న స్పృహ యువతలో ఇపుడిపుడే మొగ్గ తొడిగింది. మారుతున్న కాలానికనుగుణంగా వృత్తి రీత్యా ఎదురౌతున్న ఒత్తిళ్ళను తట్టుకునే మానసిక స్థైర్యాన్ని, శారీరక సామర్థ్యాన్ని పెంచుకోవలసిన స్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిమ్, హెల్త్ క్లబ్, యోగా సెంటర్, లాఫింగ్ క్లబ్, వాకర్స్ క్లబ్స్ ఏర్పడ్డాయి. యువతకు వ్యాయామంపై ప్రత్యేకించి ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెరిగింది. ఆరోగ్యంగా, అందంగా ఉండటం కోసం ఫిట్‌నెస్ అవసరమని భావిస్తున్నారు. వ్యాయామం, యోగా, నడక మొదలైన పద్ధతుల్లో ఫిటెనెస్‌ను సాధించడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన జిమ్‌లపై యువత దృష్టి పడింది. జిమ్‌లకు ఆదరణ పెరగడంతో జంటనగరాలతో వాటి సంఖ్య గణనీయంగా పెరిగింది. జంటనగరాలతో పాటు విశాఖపట్టణం, విజయవాడ లాంటి ముఖ్య కేంద్రాలు జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీలలో జిమ్ సెంటర్‌లు వెలిశాయి.

బాడీ బిల్డింగ్‌కు కేంద్రాలు జిమ్‌లు

బాడీబిల్డింగ్ కయితే జిమ్‌లు తగిన విధంగా ఉపకరిస్తాయి. యుక్త వయసు నుంచే బాడీ బిల్డింగ్ వ్యాయామం చేస్తే ఆరోగ్యం కోసం జీవిత కాలం పెట్టుబడి పెట్టినట్లే. ఇవాల్టి యువత మాత్రం బాడీ బిల్డింగ్‌కు తగిన విధంగానే ప్రాధాన్యమిస్తున్నారు. అయితే కొందరు సోమరిగా ఉన్నవాళ్లు ముప్పయి, నలభై ఏళ్ల వరకు వ్యాయామం చేయాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. ముప్పై దాటగానే లావెక్కడం, స్థూలాకాయం రావడంతో ఇక్కట్ల మొదలవుతాయి. అపుడు బాడీ బిల్డింగ్ కోసం ప్రయత్నించినా ఫలితం వుండదు. అయితే ఆరోగ్యం మెరుగు అవుతుంది. వాకింగ్, జాగింగ్ వల్ల కాళ్లపైనే ప్రభావం పడుతుంది. కాని స్థూలకాయం రావటానికి, శరీరంలో కొవ్వుశాతం పెరగటానికి నడుం వద్ద కొవ్వు చేరటం కారణం. వాకింగ్ వల్ల నడుంపై పెద్దగా ప్రభావం పడదు అని అశోక్‌నగర్‌లోని పవర్ జంక్షన్ జిమ్‌ను నిర్వహిస్తున్న రాజేందర్ అన్నాడు. అందువల్ల బాడీ బిల్డింగ్‌కు ప్రాముఖ్యం ఇవ్వాలి. బాడీ బిల్డింగ్‌లో శరీరంలోని ప్రతి అవయవానికి సంబంధించి ప్రత్యేకమైన వ్యాయామాలుంటాయి. పైగా బరువు పెరగటానికి, తగ్గటానికి వేర్వేరు వ్యాయామాలున్నాయి. జిమ్‌లో బెంచ్ ప్రెస్, సీటెడ్ చెస్ట్ ప్రెస్, పెక్ డెక్, లాట్‌పుల్ డౌన్, కేబుల్ రోయింగ్, ఫోర్ ఆర్మ్, స్టాండ్ ట్విస్టింగ్, అబ్‌డామినల్ బోర్డు, లెగ్ ప్రెస్, లెగ్ ఎక్స్‌టెన్షన్, లెగ్ కర్ల్, కాల్ఫ్ రైజ్, షోల్డర్ రైజర్, బైసప్స్, ట్రైసెప్స్, డంబుల్ ప్రెస్‌లు వుంటాయి. వీటిలో ఒక్కొక్కటి శరీరంలోని ఒక్కొక్క అవయవాన్ని అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతుంది. వీటికి తోడు సైక్లింగ్, రన్నింగ్ మెషిన్ కూడా వుంటాయి. జంటనగరాలలో సుమారు అయిదు వందల జిమ్‌ల వరకు వుంటాయి. జిమ్‌ను ఏర్పాటు చేయడానికి సుమారు మూడు నుంచి అయిదు లక్షల రుపాయల ఖర్చు అవుతున్నా వాటికి వున్న ఆదరణ దృష్ట్యా పెట్టుబడి పెట్టడానికి ఎలాంటి జంకు వుండడం లేదని పవర్ జిమ్‌ను నిర్వహిస్తున్న కిరణ్ అన్నాడు.



సీటెడ్ చెస్ట్ ప్రెస్

వ్యాయామం చేయాలనుకునే వారు కొందరు జిమ్‌లకు వెళతారు. డబ్బులున్న మారాజులు మాత్రం వ్యక్తిగత కోచ్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వారి మార్గ నిర్దేశకత్వంలో ఫిట్‌నెస్‌ను సాధిస్తారు. తగిన అర్హతలున్న వారిని కోచ్‌లుగా నియమించుకుంటే మంచి ఫిట్‌నెస్‌ను సాధించడం సాధ్యం. ఒకవేళ అలసత్వాన్ని ప్రదర్శించినా అతను ఉత్సాహపరుస్తాడు. వ్యాయామం చేసే సందర్భంలో గాయపడినా అతని సహకారంతో త్వరలో కోలుకోవచ్చు. ఏరకమైన వ్యాయామం తగునో లేదో వ్యక్తిగత కోచ్‌లు స్పష్టం చేయగలరు.



సీటెడ్ లెగ్ ప్రెస్

మానసిక ఆరోగ్యానికి మందు యోగా

జిమ్‌లు శారీరక దారుఢ్యాన్ని ఇస్తే యోగా కేంద్రాలు మానసిక బలాన్ని, ధృడత్వాన్ని అందిస్తాయి. శారీరక, మానసిక వికాసం కోసం యోగాను ఎంచుకోవడం జరుగుతున్నది. మనదేశంలోనే కాక ఇపుడు పాశ్చాత్య దేశాల్లో సైతం యోగా కేంద్రాలు వెలుస్తున్నాయి. చాలా కాలం నుండి అమలులో వున్న యోగాను ఇపుడు చాలా మంది అనుసరిస్తున్నారు.

వా'కింగ్'

'నడక నాతల్లి' అన్నాడో కవి. ఒకపుడు నడవటం మన జీవన విధానంలో భాగం. ఇపుడు అందుబాటులోకి వస్తున్న వాహనాల వల్ల నడకకే ప్రమాదం ఏర్పడింది. ఇది ఆరోగ్యాన్ని చెడగొడుతున్నది. పట్టుమని పది అడుగులు కూఢా లేని దూరానికి వెహికిల్ మీద వెళ్లడం మామూలయింది. ఈ క్రమంలో నడక అన్నది మహాభాగ్యమైంది. నడవటం కూడా ఓ సరదా అయింది. నడకను మరిచిపోతే ఎంత నష్టమో వయసు మీద పడితేగాని తెలియదు. శరీరం బరువెక్కినపుడు చాలామంది నడక అవసరాన్ని గుర్తిస్తున్నారు. అలాకాక నడకను తొలినుంచి అలవాటు చేసుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం వుంది. నడవటం అన్నది వివిధ వయసుల వారికి విభిన్న రకాలుగా ఉపకరిస్తుంది. మూడు పదుల వయసు వచ్చేసరికి కణ విభజన రేటు క్రమంగా తగ్గుతుంది. కాలరీలు ఏమో పెరుగుతుంటాయి. దీనివల్ల బరువు పెరిగి శరీరంలో కండలు పలుచబడతాయి. ఈ వయసులో నడకను జీవితంలో భాగం చేసుకోవడం మంచిది. దీనివల్ల కాలరీలు ఖర్చు అవుతాయి. నడక వల్ల రోజంతా ఉత్సాహంగా ఉంటారు. రక్తపోటును నివారించడానికి, రోగ నిరోధక వ్యవస్థను బలీయంగా ఉంచుకోవడానికి వ్యాయామంలో నడక ఉపకరిస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. ఎవరైతే ఎక్కువగా నడుస్తారో వారు చాలావరకు ఆరోగ్యంగా ఉంటారు. ఆరోగ్యంగా ఎక్కువ కాలం జీవించే అవకాశం వుంది. యాభై వయసులో మహిళలు మెనోపాజ్ దశకు చేరుకోవడం వల్ల ఈస్ట్రోజన్ తగ్గుతుంది. దీనివల్ల కార్డియో వాస్కులర్ సమస్య తీవ్రమవుతుంది. నడక వల్ల ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. అంతేగాక ఈ వయసులో వచ్చే కీళ్ల నొప్పులను దూరం చేసుకోవచ్చు. ☆

కథ



ఓ "చెత్త" కథ

- ఎమ్వీయెస్శర్మ

"ఈ రోజు సాయంత్రం 7 గంటలకి కాలనీ మీటింగంటండి! మీకు చెప్పమని సెక్రటరీగారు పంపించారండి!" ఉదయాన్నే మా కాలనీ వాచ్‌మెన్ కబురు తెచ్చాడు. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మా కాలనీ సెక్రటరీ యువకుడు. ఉత్సాహవంతుడు. అన్నింటికీ మించి బహు ఓపిక వున్నవాడు. అందుకే పోటీ లేకుండా ఎన్నికయ్యాడు. ఇక మా ప్రెసిడెంటు గారైతే చాలా గొప్ప గొప్ప, కొత్త కొత్త ఆలోచనలు చేస్తూ క్రియేటివ్‌గా వుంటారు. ఆయన పెద్ద వాళ్ళలో పెద్ద. కుర్రాళ్లలో కుర్రవాడు. వీరిద్దరి నాయకత్వం మమ్మల్ని ఎంత ఉత్సాహ పరిచిందంటే మేమెవ్వరమూ కాలనీ మీటింగంటే మిస్సయ్యే సమస్యే లేదు. అదీ సంగతి.

సాయంత్రం అనుకున్న దానికన్నా అరగంట ఆలస్యంగా మీటింగ్ దగ్గరికి వెళ్ళాను. అప్పటికే మీటింగ్ మొదలైంది. కార్యదర్శి ఏదో ప్రతిపాదనను వివరిస్తున్నట్లు వుంది. మెంబర్లంతా చెవులు రిక్కించి వింటున్నారు. నా పక్కన కూచ్చున్న సుబ్బారావునడిగేను విషయం ఏమిటని. "ఆ! ఏముంది! అంతా చెత్త!" అన్నాడు. నిర్ఘాంతపోయేను. నా మొహం చూసి నవ్వి "అదేనండీ! కాలనీ చెత్తకుండీ గురించి" అన్నాడు సుబ్బారావు.

మా కాలనీ చెత్తకుండీ ఒక దీర్ఘకాల వివాదాస్పద అంశం అన్న విషయం ఇక్కడ నేను మనవి చేయాల్సి వుంది. ఎవరి క్వార్టర్ ముందుకి చెత్తకుండీ వస్తే ఆ క్వార్టర్‌లోని వాళ్లు దానిని పక్కకు జరిపించెయ్యమని గొడవ చేస్తుంటారు. ఆ గొడవలోనూ న్యాయం వుంది మరి! వంద ఇళ్ళ చెత్త వెదజల్లే దుర్గంధాన్ని ఎవరు భరించగలరు చెప్పండి! అందుకే నెలకోమారు ఆ చెత్తకుండీ లొకేషన్‌ని మార్చేయాలన్న అంగీకారాని కొచ్చాం. రాష్ట్రంలో చంద్రబాబు రెండు నెలలకొక జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తే మా కాలనీ సెక్రటరీ గారు మాత్రం ప్రతి నెలకూ ఒకమారు చెత్తకుండీని దిగ్విజయంగా జరిపిస్తూ వుంటాడు. అందరికీ ఇంత ముఖ్యమైన చెత్తకుండీ గురించి కార్యదర్శి గారేమని ప్రతిపాదిస్తున్నాడో విందామని చెవులు రిక్కరించేను.

"అంచేత నేను చెప్పేదేమిటంటే ఈ చెత్తకుండీని మనం శాశ్వతంగా వదిలించుకునే మహత్తర అవకాశం వచ్చిందిప్పుడు. మనం దానిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీదానికీ ఓ మూల్యం వుంటుంది మరి. మనం ఈ చెత్తకుండీని వదిలించుకోడానికి నెలకో పది రూపాయలు మూల్యం చెల్లించాలి."

వెంటనే అసంకల్పిత ప్రతీకార చర్యలాగా పది చేతులు లేచాయి. మాట్లాడే అవకాశం ఆయా చేతుల స్వంతదారులకి ఇమ్మంటూ. ఓ అరడజను మంది ఉత్సాహవంతులు లేచి ఏదేదో మాట్లాడడం మొదలెట్టారు. ఒక్కరూపాయి అదనంగా ఇమ్మనమన్నా ఒప్పుకోని వాళ్లు మా కాలనీలో చాలా మంది వున్నారు. "ఆ సంగతి తెలిసి మరీ సెక్రటరీ గారింత సాహసాని కొడిగట్టాడేమిటబ్బా!" అనుకుంటూ నేను మౌనవ్రతంలో వుండిపోయాను.

"ఆగండాగండి! మీరు మాట్లాడేముందు మన మున్సిపల్ కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ ఎ.ఇ.గారు మాట్లాడతారు వినండి" అని ప్రెసిడెంటు గారుగట్టిగా ప్రకటించారు. దాంతో అంతా నిశ్శబ్దం.

ఎ.ఇ.గారు లేచి అనర్గళంగా, అత్యంత ప్రతిభావంతంగా మాట్లాడడం మొదలుబెట్టారు. చెత్తకుండీ లాంటి అల్ప విషయాల్లో కూడా మీ వంటి మేధావంతులు (!), దేశభక్తులు (!) సందేహాలతో ఊగిసలాడితే ఒక మన విశాఖపట్నం, సింగపూర్ లెవెల్‌కి ఎప్పుడు చేరుతుందని ప్రశ్నించేసరికి మా కళ్ళు తెరుచుకున్నాయి. అమెరికా లెవల్‌కి మనం ఎదిగేదెప్పుడు? అని ఆయన అన్నప్పుడు మా కళ్లు చెమర్చాయి. "చెత్తకుండీలు, ఊరకుక్కలు, పందులు, గేదెలు; రోడ్డుపైనే కొన్ని అనివార్య, కనీస ప్రకృతి ధర్మాలు నిర్వర్తించేసుకోవడం వంటి అనాచారాల నుండి మనకి విముక్తి ఎప్పుడు" అని ఆయన గర్జించేసరికి మా కళ్లకి ఆయన ఓ రాజారామ్మోహనరాయ్ లాగా కనపడి మా గుండెలు ఉప్పొంగాయి. "దేశం పిలిచింది" అనుకుంటూ మా తాత సత్యాగ్రహానికి బయలుదేరిన చందాన "రోడ్లు పిలిచాయి" అనుకుంటూ నేను వెంటనే లేవబోయేను. మా సుబ్బారావు ఆపబట్టి సరిపోయింది.

ఇంతకీ విషయం ఏమిటిట? మున్సిపల్ కార్పొరేషన్ వారు మేయర్, మున్సిపల్ కమిషనర్ గారల విదేశీ పర్యటనల అనంతరం ఇటీవల విశాఖనగర రోడ్లన్నింటినీ అమెరికాలోని రోడ్ల స్థాయికి తేవాలని నిర్ణయించేరు. అందుకోసం అమెరికాలోని ఒక నిపుణుడికి ఓ కోటి రూపాయల ఫీజు సమర్పించుకుని ఆయనిచ్చిన నివేదికను తెచ్చుకున్నారు. దానిని అమలు చేయడానికి నిర్ణయించేరు. అందులో ఏముందట? మొదట చెత్తకుండీలను నిర్మూలించాలట. అప్పుడు ఆటోమేటిక్‌గా కుక్కలు, పందులు దిక్కులేనివైపోయి ఊరొదిలిపోతాయట. మిగిలిన గేదెలను లటక్కన పట్టేసుకోడానికో స్పెషల్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తారట. మరి బహిరంగ విసర్జన కార్యక్రమాలను అరికట్టడానికి ఓ స్పెషల్ స్కీము వుందట. దానిని స్కీమ్-2గా అమలు చేస్తారట.

స్వర్ణాంధ్రప్రదేశ్, విజన్ 2020లను తలదన్నే లెవెల్‌లో వున్న ఈ స్కీము మమ్మల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది. ఉత్సాహం పెల్లుబికి గట్టిగా చప్పట్లు కొట్టేశాం. "సార్! నాదో చిన్న డౌటు" అంటూ సుబ్బారావు లేచాడు. "అడగండి! యు ఆర్ వెల్‌కమ్" అని ఎ.ఇ.గారు గంభీరంగా అన్నారు. "చెత్తకుండీ లేకపోతే మా ఇంట్లోని చెత్త ఎక్కడ పొయ్యాలి" అనడిగేడు సుబ్బారావు

"వస్తున్నా! వస్తున్నా! మీవంటి ఇంటలిజెంట్ పెర్సన్ ఇలా అడుగుతారని నాకు తెలుసు. సాధారణంగా మన ఇళ్లల్లో రెండు రకాల చెత్త వుంటుంది. ఒకటి డ్రైవెరైటీ. కాగితం ముక్కలు, తలవెంట్రుకలు ఎట్సెట్రా. రెండోది వెట్ వెరైటీ. అంటే పాచిపోయిన అన్నం, కుళ్ళిపోయిన కూరగాయలు ఎట్సెట్రా. అవునా?"

ఎ.ఇ.గారి నిశిత విశ్లేషణకి పొంగిపోయి "యువార్ పెర్ఫెక్ట్‌లీ కరెక్ట్ సార్!" అని అరిచేశాను. అందరూ గట్టిగా చప్పట్లు కొట్టేశారు.

"ఆగండాగండి! రెండు వెరైటీల చెత్తకీ మీరు మీ ఇంట్లో రెండుబేగ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. రోజూ ఒక కుర్రవాడు మీ ఇంటికొచ్చి ఆ సంచుల్లోని చెత్తను సేకరించి తీసుకుపోయి సైకిల్ రిక్షాలో ఊరికి దూరంగా పడేసి వస్తాడు. అతనికి సైకిల్ రిక్షా మేమిస్తాం. నెలకి ఇంటికి పది రూపాయలు మీరివ్వాలి. ఓకేనా?" అందరమూ "ఓకేసార్" అని అరిచి ఆయనను కరచాలనాలతో అభినందించి దేశాభివృద్ధి అంటే రోడ్ల అభివృద్ధే అని ప్రకటించి వీడ్కోలు చెప్పాం.

డ్రై చెత్తకో ప్లాస్టిక్ బుట్ట, వెట్ చెత్తకో ప్లాస్టిక్

బకెట్ అవసరమని గుర్తించాం. వంద ఇళ్ళకీ హోల్‌సేల్ రేటుకే రిటైల్‌గా సప్లై చేసేడు మాకాలనీలో దుకాణం పెట్టిన షావుకారు గారు. మర్నాడే చెత్తకుండీ అదృశ్యం అయింది. కుక్కలూ లేవు, పందులూ లేవు. అమెరికా లెవెల్‌కి ఎదిగిపోయినందుకు అందరమూ సంతోషించేం. ఊళ్లోని మిగతా కాలనీలందరికీ మమ్మల్ని ఆదర్శంగా చూపుతూ పత్రికల్లో వార్తలు వచ్చాయి. లోకల్ కేబుల్ టి.వి.లో మాకాలనీని, సెక్రటరీని, ప్రెసిడెంటుని చూపించారు. వారిద్దరూ మాకందరికీ టీపార్టీ కూడా ఇచ్చేరు.

రోడ్డు మీద గనుక చెత్త పోస్తే అయిదు వందలు జరిమానా కట్టాలంటూ మున్సిపాలిటీ వాళ్లు మైకు ప్రచారం చేసేరు. అలాంటి కఠిన దండన లేకపోతే క్రమశిక్షణ వుండదని, మున్సిపాలిటీ వాళ్లు మంచి పని చేసేరని అభినందిస్తూ మా సెక్రటరీ ప్రెస్ స్టేట్‌మెంటిచ్చేడు. అతగాడి ఫొటోతో సహా అది పత్రికల్లో అచ్చయ్యింది. మళ్లీ మాకందరికీ టీపార్టీ వచ్చింది.

ఓ రెండు వారాలు గడిచేయి. ఈ రెండు వారాల్లోనూ కొన్ని చిన్న చిన్న సంఘటనలు జరిగాయి. సుబ్బారావింట్లో వున్న అతగాడి ముసలి అత్తగారు బ్రహ్మచెముడు కావటాన, అక్షరజ్ఞానం కొరవడినందున "చెత్త" నిర్ణయం అర్థం చేసుకోలేక అలవాటు కొద్దీ రోడ్డు మీద చెత్త పారబోసి ఎంచక్కా వచ్చింది. మున్సిపాలిటీ వాళ్లు వెంటనే వచ్చి వాలారు. సెక్రటరీ గారి పలుకుబడిని వుపయోగించి జరిమానా లేకుండా చేసుకున్నాం. కాలనీ పరువు ప్రతిష్టల సమస్య ఇది! నేను, సెక్రటరీ, సుబ్బారావు ఆ చెత్తని తిరిగి భద్రంగా ఇంట్లో దాచి రెండు బకెట్ల నీటితో రోడ్డుని కడిగేం. చెప్పొద్దు మరి! రోడ్డుని అలా పబ్లిక్‌గా కడుగుతున్నపుడు నేనేం బాధపడలేదు సరికదా నా హృదయం ఉప్పొంగిన దేశభక్తితో పరవశించింది. చెత్త కోసం కుర్రాడు వచ్చే వరకూ ఆఫీసుకు వెళ్లకుండా ఇంటి దగ్గరే వుండాల్సొచ్చినందున కాలనీలో ఓ పదిమంది చీవాట్లు తిన్నారు వారి వారి ఆఫీసర్ల చేత. అయితే సదరు ఆఫీసర్లకు కూడా 'చెత్త' సమస్య వున్నందున కాలక్రమంలో ఆ ఆఫీసర్ల నోర్లు మూతబడ్డాయిలెండి! చెత్త సేకరించే కుర్రాడు వారంలో ఒకరోజు రావడం కుదరదని చెప్పాడు. ఆ తర్వాత తనకి కూడా లాంగ్‌లీవులూ, సిక్ లీవులూ మాకున్నట్లే వుంటాయని స్పష్టం చేశాడు. తను రాని రోజుల్లో వేరే ఎవరినీ నియమించడం కుదరదని స్టేట్ గవర్నమెంట్ రూల్స్ ప్రకారం లీవ్ వేకన్సీ అపాయింట్‌మెంట్ లేదని కూడా తేల్చిచెప్పేడు. ఇలాంటి చెదురు మదురు ఘటనలు మినహా కాలనీ ప్రశాంతం గానే వుంది. రోజులు గడుస్తున్న కొద్దీ ఎందుకో నా గుండెల్లో చెప్పలేని గుబులు ప్రారంభం అయింది. సెక్రటరీ దగ్గరికెళ్లాను. అతనిదీ అదే పరిస్థితి. సుబ్బారావు పరిస్థితీ డిటోయే.

ఓ రోజున హఠాత్తుగా మా బామ్మ చెప్పాపెట్టకుండా దిగబడింది. ఇంట్లోకి వచ్చీ రాగానే చీరెకొంగు ముక్కుకి అడ్డం పెట్టుకుని "అబ్బ! ఏమిట్రా ఆ ఎలక చచ్చిన వాసన? ఎలా భరిస్తున్నార్రా? ఏ మూల దూరి చచ్చిందో! వెంటనే తీసి బైటపారెయ్యండి!" అని అరిచింది. మేమంతా తెల్లబోయేం. ఇల్లంతా వెతికేం. ఎక్కడా ఎలక జాడే లేదు. ఏమైంది బామ్మకి?

బామ్మ నిలకడగా కూచోలేకపోయింది. ఇల్లంతా కలియదిరిగింది. చివరికి రెండు 'చెత్త' బుట్టలూ పట్టుకొచ్చి భరించలేని కంపు ఎక్కడిదో తేల్చింది. "ఏ తలమాసిన వాడు చెప్పిన పనిరా ఇది" అంటూ తిట్ల దండకం మొదలెట్టింది. కూచోబెట్టి మా బృహత్తర ప్రాజెక్టు గురించి వివరించేను. అంతా విని జాలిగా "ఓరి వెర్రినాగన్నా! బైట పారబోయాల్సిన చెత్తని ఇంట్లో దాచుకుంటార్రా ఎవరైనా" అంది. "ఆ కంపునంతా ఎలా భరిస్తున్నార్రా మీరంతా?" అనడిండి. "మీరు మున్సిపాలిటీకి ఇంటి పన్ను దేనికి కడుతున్నట్టు? రోడ్లు శుభ్రంగా వుంచడానికి కాదా? వాళ్లకి పన్ను కట్టి, పైగా కుర్రాడికి పదేసి రూపాయలు ఇచ్చుకుని చెత్తని ఇంట్లో దాచుకుంటున్నారా? మీకు తలకాయలు లేవూ? వాటిలో ఇంగిత జ్ఞానం లేదూ? అందరికీ మంచినీళ్లు కూడా అందించలేని ఈ దేశంలో రోడ్లు మాత్రం అమెరికా రోడ్లల్లా వుండాలని ఏ వెధవ చెప్పాడ్రా మీకు? చెప్పండి!" అని గర్జించింది.

ఏం చెప్పడం మాకెవరికీ నోట పలుకూలేదు, కనురెప్పపడనూ లేదు. మా ముక్కులకి వాసన పసికట్టే శక్తి అంతకుముందే లేదు!

మా ముసిలి బామ్మ చాదస్తం గాని, అమెరికా లెవల్ రోడ్ల కోసం ఆ మాత్రం కంపు భరించలేకపోతే ఎలా చెప్పండి? అంత భరించలేనివాళ్లు వుంటే వాళ్ళ కోసం హైటెక్ బాబు అమెరికన్ సెంట్లు, స్ప్రేలు సిద్ధం చేసే వుంచాడు గదా!

☆

శుభాకాంక్షలతో...

నకరికల్లు మండల రైతు
మిల్లర్స్ అసోసియేషన్
నకరికల్లు, గుంటూరుజిల్లా.



బతుకుపాట

రచన : యాసలపు సూర్యారావు,
వెల : రు.10, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ప్రజలు, శ్రమ జీవితం, అనుభవం, ఉద్యమం, పోరాటం వీటన్నింటిలో. వీటన్నిటితో విడదీయరాని, విడదీయలేని సంబంధం పాటకు ఉన్నది. అలాకాక కేవలం కొద్ది మంది శ్రవణానందం కోసమే అయితే పాట అక్కర్లేదు. శబ్దం చాలు. ప్రజల పట్ల గురుతరమైన బాధ్యత కలిగిన పాటల రచయిత పాటకు పదును పెడుతూ పాటను ప్రజల కరదీపికగా చేసే ప్రయత్నం చేస్తుంటాడు. ఆ కోవలో నిత్య విద్యార్థి సూర్యారావు. ఆయా సందర్భాల్లో స్పందించి రాసిన గీతాలు ఇప్పుడు బతుకుపాటగా ముందుకొచ్చింది.

'కళలకు నెలవగు కన్న తల్లిరా, గరికపాటికది పుట్టినిల్లురా' అంటూ ఆంధ్రప్రజానాట్యమండలిని కీర్తించాడు. పీడిత జనబంధువయ్యా, అతడే మన సుందరయ్యా! హక్కుల పీడకులకు గురిపెట్టిన వీరుడు మాకినేని అంటూ విప్లవమూర్తులకు శ్రద్ధాంజలి ఘటించాడు. రైతన్నల, నేతన్నల, కూలన్నల కష్టాలను వివరించాడు. లేని వాళ్ళందర్నీ ఒక్కటిగా చేద్దాం అన్నాడు.

నాలుగు వర్ణాలకు నాథుడు ఆ దేవుడైతే, నేడు వందలాది కులాలకు తల్లీతండ్రీ ఎవరూ! అంటూ దళిత గీతంలో మత ఛాందసులకు సూటి ప్రశ్న వేశాడు. ప్రజాతంత్ర యువకుల, విద్యార్థి ప్రగతి పథంలో కలసిపోయాడు. నిజం నిజం సోషలిజం వచ్చుట నిజం నిజం సోషలిజం అని చారిత్రక విశ్వాసాన్ని ప్రకటించాడు.

ఇజాలు ఇలను ఎన్నున్నా నిజం మార్క్సిజమని, దోపిడీల ఇజాలన్నీ మార్క్సిజం ముందు నింక
వృథా వృథాయేనని, అజేయమనేది మార్క్సిజమని, ప్రపంచానికి చాటుదాం అంటూ నినదించాడు.

నమ్మిన సిద్ధాంతాన్ని ప్రజల అనుభవంలోకి అందునా పాట రూపంలో తీసుకురావడం కష్ట సాధ్యం. ఇదొక సేద్యం, తప్పదు. వేరే హైటెక్ దారిలేదు.

- కె.శాంతారావు

మనిషిని ప్రేమించలేని కవి కవిత్వం రాయలేడు. అదీ "శిరస్సు గల మనిషిని ప్రేమించాలి." గాయాలతో, కన్నీళ్ళతో దుఃఖపు బరువు మోస్తున్న మనిషిని ప్రేమించినప్పుడే నిజమైన కవిత్వం పండుతుంది. ఛిద్రమైన జీవితంలోని సౌందర్యాన్ని కవిత్వీకరించాలంటే కవికి వాస్తవం తెలిసుండాలి. కన్నీటి రుచి, రంగు, వాసనా తెలిసుండాలి. మృత్యువు, ప్రేమ రెంటి గొంతుకా దొరకపుచ్చుకొన్న పులిపాటి గురుస్వామి 'చెమ్మ' గొప్ప కవిత్వం. స్త్రీ పులింగాల బాడీ పాలిటిక్స్‌ని తన కోణం నుంచి దర్శించిన వాడు గురుస్వామి.

ఈ కవి మనల్ని నిలదీస్తాడు. ఓదారుస్తాడు. తనతోపాటు దుఃఖ సముద్రాల్ని దాటి గమ్యం వేపు పట్టుకుపోతాడు. కవిత్వాన్ని 'కన్ను'గా భావించిన వాడు కావటం వల్లే జీవితాన్ని తాత్వికంగా వ్యాఖ్యానించగలిగాడు. అస్తిత్వాలన్నీ ప్రమాదంలో పడుతున్నవేళ ఈ కవి తనను తాను వెదుక్కుంటున్నాడు. పరాయీకరించబడిన జీవితాల మధ్య నిలబడి తనను దొరకబుచ్చుకొని 'తన గొంతు'తో గాయాల్ని, బాధని గానం చేస్తున్నాడు.

ఈ కవి దుఃఖాన్ని ప్రేమిస్తాడు. గానం చేస్తాడు. ఆ దుఃఖానికీ కారణం ఉంది. కారణం లేకుండా ఎవరేడుస్తారు? దుఃఖంమ్మీద ఎందుకింత ప్రేమ? బతుకులోని కన్నీళ్లు ఇంత ఇష్టంగా ఎలా కనబడుతున్నాయి? విచారాన్ని ప్రేమించటం 'మో', 'సీతారాం'లాగే ఈ కవీ చేస్తున్నారు. అయితే, వాళ్లకీ ఈ కవికి చాలా తేడా వుంది.



'ఆకలికి ఆకలికి మధ్య యుద్ధంలో మనుషులు, మనిషి వాసన మరో రకంగా, మందుగుండు వాసన, పట్టా కాగితాల కోసం సగం వయసు, ముల్లుల మధ్య పూయటం గొప్ప విషయం కదా!" కష్టాల మధ్యే మనిషి రాటు దేల్తాడని, ముందుకు సాగుతాడని కవి చెప్తున్నారు.

జీవితంలోని సౌందర్యాన్ని చూసే కోణమ్మీదే కవి కవిత్వం ఉంటుంది. భావచిత్రా లుంటాయి. ప్రతీకలుంటాయి. అది ఊహాత్మక సౌందర్యమైతే ఆ కవిత్వం కాల్పనికతకు దారితీస్తుంది.

సామూహికత నుండి వేరుపడిన దుఃఖం వ్యక్తిగతంగా ఏవిటి సాధించగలదు!? 'నేను'కు ఇప్పుడు అర్థం 'మనం'గా చెప్పుకోవాలి. గురుస్వామి దుఃఖమంతా సామూహికతదే. తన మూలాలు తెలిసిన వాడు కావటం వల్లే తన విముక్తినీ గుర్తించగలిగాడు. అభివ్యక్తిలో గాఢతని, తాత్వికతని ఒంటినిండా నింపుకున్న కవిత్వం 'చెమ్మ'.

- జిలుకర శ్రీనివాస్

స్వీకారం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం మే 19 సుందరయ్య గారి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సుందరయ్య స్మారకోపన్యాసం కార్యక్రమంలో సి.పి.ఎం. పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్ చేసిన ప్రసంగాన్ని, ఉల్ఫెన్‌సన్ మన రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ ఆర్థికవేత్త, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ అధ్యాపకులు ప్రొ॥ భగవత్ పట్నాయక్ చేసిన ప్రసంగాలను పుస్తక రూపంలో ప్రచురించారు. సమకాలీన రాజకీయ, ఆర్థిక మార్పులను తెలుసుకోగోరే వారందరూ చదవదగిన పుస్తకం ఇది.

భారతరాజకీయాలలో మితవాద దాడి

ప్రపంచబ్యాంకు - పెరుగుతున్న దారిద్ర్యం

ప్రచురణ:సుందరయ్య విజ్ఞాన కేంద్రం, వెల:రు.6/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



ప్రపంచ వ్యాపితంగా ఇదివరకెన్నడూ లేని అసాధారణ స్థాయిలో పెట్టుబడిదారీ వర్గ దాడులను ప్రతిఘటిస్తూ వివిధ దేశాల్లో జరుగుతున్న పోరాటాలను సంక్షిప్తంగా కార్మికులు, ఉద్యోగుల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నమే ఈ పుస్తకం. గత దశాబ్దంలో శ్రామిక ప్రజలపై తీవ్రమైన దాడులు జరుగుతూ వచ్చాయి. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాల ప్రకారం నడుచుకొనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక రంగంలో పెనుమార్పులు చేస్తూ వచ్చాయి.

ప్రపంచీకరణ దాడి - కార్మికవర్గ పోరాటాలు

వివిధ దేశాల అనుభవం

రచన : సుకోమల్ సేన్,
తెలుగు సేత : డి.ఆర్.కె.రెడ్డి, వెల : రు.10/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

‘ఛాయా గ్రహణంలో మట్టి బతుకులు’

మట్టి జీవితాలను, వారి వెతల దృశ్యాలను కళ్ళముందు కదలాడే సజీవంగా నిలిపి మనల్ని ‘డిస్టర్బ్’ చేసే విధంగా ఛాయా చిత్రాలను అందించే వారు జి. భరత్ భూషణ్.



చీకటి కోణాలలో సృజనాత్మకతను ప్రతిబింబిస్తున్న ఫొటోలు ఎవరినైనా ఆకట్టుకుంటాయి. పల్లెల్లో, పట్నాల్లో శ్రామికులు పడుతున్న వ్యధాభరిత జీవిత దృశ్యాల్ని తన కెమెరాతో బంధించి మనల్ని ఆలోచింపచేసే భరత్‌భూషణ్ రెండున్నర దశాబ్దాల కాలంలో తనకంటూ ఒక స్థానాన్ని పదిలపరచుకున్నారు. అనారోగ్యం ఒకవైపు పీడిస్తున్నా కెమెరా దిమ్మరిగా కనిపించే భరత్‌భూషణ్ ‘పిక్టోరియల్’ ఫొటోగ్రఫీ నుండి ఫొటో జర్నలిజం వైపు దృష్టి సారించి ఫొటోగ్రఫీలో నూతన ఒరవడిని సాధించారు. ఫొటో జర్నలిజం ద్వారా ఛాయా చిత్రకళలో గణనీయమైన మార్పులకు, ఆలోచనలకు తావునిచ్చారు. ఆయన ఇప్పటి వరకు రెండు ఎగ్జిబిషన్లు, ఒక వన్‌మ్యాన్ షో ఇచ్చారు. అయితే ఈ ప్రదర్శనల్లో ప్రధానంగా ఒక సబ్జెక్ట్ మీదే ప్రదర్శనకు పూనుకోవడం మరో ప్రత్యేకత. కష్టాల సమాజంలో వారి పనుల్లోని వైవిధ్యాన్ని మనం అతని ఫొటోల్లో చూడవచ్చు. పల్లె గుండె చప్పుళ్ళ నుండి పట్నం దాకా వుండే జీవిత సంఘర్షణ, వీధి పాలైన బాల్యం, సంక్రాంతి రంగవల్లులు, జానపద కళలు, ప్రపంచీకరణ బతుకమ్మ, కులవృత్తుల జీవన దృశ్యాలతో 1997లో కళాభవన్ ఐసిసిఆర్ ఆర్ట్ గ్యాలరీలో అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ సౌజన్యంతో ‘పీపుల్ అండ్ ఈస్థటిక్స్’ పేరుతో ఒక ప్రదర్శనను నిర్వహించారు. ఇందులో 70 ఫొటోలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో పిల్లలు బీడీలు చుట్టడం, వివిధ పనుల్లోని బాలల ఫొటోలు చూస్తే వాళ్ళ బాధలు, గాథలు కనిపిస్తాయి. రంగు రుద్దేసిన శిల్పం పికాసో చిత్రంలా భ్రమింపచేస్తుంది. ముంతగూడు, హరప్పా, మొహంజదారోలా అనిపిస్తుంది. మనం రోజూ చూసే తలుపులే ఆయన ఛాయాచిత్రంలో మరింత అందంగా కనిపిస్తాయి. మన ఎదురుగా ఉండే అనేక జీవిత వాస్తవాలను ఆయన చిత్రాల ద్వారా చూడవచ్చు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బాలికలు చేస్తున్న చాకిరిపై ఆయన కెమెరా క్లిక్ మనిపించారు. ఆ దృశ్యాలను మన కళ్ళముందు నిలుపుతూ 1998లో ఐసిసిఆర్ ప్రాంగణంలో ‘గర్ల్‌ఛైల్డ్’ ఫొటో ప్రదర్శన నిర్వహించారు. ఇది ఆయనకు ఎంతో పేరు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం ‘దర్వాజా’లపై ఆయన ప్రాజెక్టు కొనసాగుతోంది.

మొదట్లో చిత్రాలు గీసే భరత్ భూషణ్ హైదరాబాద్, వరంగల్‌లో పెయింటింగ్ వన్‌మాన్ షో కూడా నిర్వహించారు. ఆ దశలో వరంగల్‌లోని ప్రముఖ చిత్రకారుడు మురళీకృష్ణ ద్వారా ఫొటోగ్రఫీలోకి మారారు. తను వరంగల్ నుండి హైదరాబాద్‌కు మారిన తరువాత కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్‌లో రెండేళ్ళ డిప్లొమా చేసారు. గోల్డ్‌మెడల్‌తో తన కళకు మరింత మెరుగులు దిద్దుకున్నారు. ‘ఉదయం’ ప్రారంభంలో ప్రధాన ఫొటో జర్నలిస్టుగా మారి పత్రికారంగంలో ముఖ్యుడైనారు. సితార, జ్యోతిచిత్రలాంటి సినిమా పత్రికల్లో స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా కూడా పనిచేశారు. దీంతోపాటు అరవిందన్ ‘కాంచనసీత’, నరసింగరావు ‘రంగులకల’ సినిమాలకు స్టిల్ ఫొటోగ్రాఫర్ బాధ్యతలు నిర్వహించారు. రవీంద్రన్ ‘హరిజన్’ సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశారు. కమర్షియల్‌గా ఉండటం ఇష్టం లేక ఫ్రీలాన్స్ ఫొటో జర్నలిజంలో స్థిరపడ్డారు.

ప్రస్తుతం వస్తున్న ఇంగ్లండ్ పత్రికలతో సహా అన్నింటిలోనూ భరత్ భూషణ్ ఫొటోలు కనిపిస్తాయి. బ్రిటన్‌లో ఫొటోగ్రఫీ మొదలైన కాలంలోనే మనదేశంలో కూడా ఫొటోగ్రఫీ ప్రారంభమైనప్పటికీ మనవాళ్ళు పిక్టోరియల్ ఫొటోగ్రఫీని ప్రాక్టీస్ చేయలేదని, అందువల్లే చారిత్రక సంఘటనలకు సంబంధించి డాక్యుమెంటేషన్ జరగలేదని భూషణ్ ఆవేదన వ్యక్తం చేస్తారు. 1947కు ముందు జరిగిన స్వాతంత్ర్య సంగ్రామ దృశ్యాలను మన ఫొటోగ్రాఫర్లు తీయలేదని, లైఫ్ మ్యాగజైన్ ఫొటోగ్రాఫర్ ‘మార్గరెట్’ తీసినవే ఆధారంగా ఉన్నాయని చెప్పారు. తన జీవన మజిలీలో అనేక చేదు అనుభవాలను దిగమింగుకుంటూ తాత్కాలికంగా క్యాన్సర్ బారి నుండి బయటపడి చీకటి కోణాల్లో దాగిన జీవితాలకు తన ఛాయాచిత్రాల ద్వారా జీవం నింపుతున్న భరత్ భూషణ్ ఎంతైనా అభినందనీయుడు.

-టి.వి.నారాయణ

'అంతా నిజమే చెప్తాను'

కర్రా ఎల్లారెడ్డి

"మన దేశంలో నేరం చేసిన వాళ్ళకు శిక్షలు తక్కువ"

"దానికి కొంత కారణం పోలీసుల అవినీతి"

నేరం చేసిన వాళ్ళపై కేసులు నమోదు చేసే పోలీసులు ఆ కేసులు కోర్టుల్లో విచారణకు వచ్చినప్పుడు నేరం చేసిన నిందితులకు సహకరించడం వల్లనే ఎక్కువ కేసులు వీగిపోతున్నాయి. రాజీపడే మనస్తత్వం వల్ల మిగతా కేసులు డీలా అవుతున్నాయి.

నేరం చేసిన వారికి శిక్షలు పడితేనే మరొకరు నేరం చేయకుండా ఉంటారు. నేరాలు జరిగినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు నిందితులపై కేసులు పెడతారు. ఆ నిందితులు పోలీసులను ఆశ్రయించి వారికి డబ్బులు ఇచ్చి తమ కేసును వీలైనంత బలహీనంగా తయారు చేయడానికి పోలీసుల సహకారం కోరుతారు. ఆ కేసును పరిశోధించి సాక్ష్యాలు సేకరించి, ఛార్జిషీట్ దాఖలు చేశాక కోర్టు ముందు విచారణ మొదలవుతుంది.

శిక్షలు ఎందుకు పడటం లేదు? అన్నది మన ప్రశ్న కనుక కానిస్టేబుల్ రామారావు పనితీరును మచ్చుగా తెలుసుకుంటే శిక్షలు పడకపోవటానికి కారణాలన్నీ తెలుస్తాయి.

పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసుల్లో నిందితులు ప్రతి వాయిదాకు కోర్టుకు హాజరవుతారు. వారి కేసులను వాదించటానికి వారు నియమించుకున్న లాయర్లు ఉంటారు. పోలీసుల తరపున అంటే ప్రభుత్వం తరపున కేసులను వాదించేందుకు, నిందితులకు శిక్షలు పడేలా చూసేందుకు ప్రభుత్వం నియమించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు ఉంటారు. ఈ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లకు ప్రభుత్వమే జీతం చెల్లిస్తుంది. ఆయా క్రిమినల్ కేసుల్లో సాక్షులను కోర్టు ముందుకు తీసుకొచ్చే బాధ్యత కేసులను నమోదు చేసిన పోలీసులది. ఆ సాక్షుల చేత కోర్టులో సాక్ష్యం చెప్పించటం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల బాధ్యత. ఆ విధంగా రామారావు వంటి కానిస్టేబుళ్ళు సాక్షులతోను, నిందితులతోను నిత్య సంబంధాలు కలిగి ఉంటారు.

ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్ కోర్టు విధులకు హాజరై పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు, కోర్టుకు సహకరిస్తాడు.

మన రామారావు కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి ఇరవై ఏళ్ళు దాటింది. పదహారేళ్ళ నుంచి ఏ పోలీస్ స్టేషన్‌లో పని చేసినా అతడు కోర్టు విధులకే హాజరవుతున్నాడు. ఆవిధంగా రామారావుకు క్రిమినల్ కేసుల విచారణ గురించి మంచి అవగాహన ఏర్పడింది. డ్యూటీపై మంచి అవగాహన వున్నట్టయితే ఎవరైనా ఒక వ్యక్తిని ఆ పనిని సమర్థవంతంగా చేయాలి. కానీ రామారావు అందుకు విరుద్ధం. రామారావు తనకున్న అవగాహనతో నిజాయితీగా విధులు నిర్వహిస్తే చాలా కేసుల్లో నిందితులకు శిక్షలు పడాలి. కానీ 95 శాతం కేసుల్లోని నేరస్తులకు శిక్షలు పడటం లేదు.

నిందితుల వద్ద డబ్బులు గుంజి సాక్షుల చేత అబద్ధం చెప్పించడంలో రామారావుకున్న పదహారేళ్ళ కోర్టు అనుభవం సహాయ పడుతోంది. అందుకే అతడు ఈ రోజు హీరోహోండాపై వెళ్ళగలుగుతున్నాడు. అతనికొచ్చే జీతంతో వాహనం ఖర్చులు భరించడం అసాధ్యం. పై ఆదాయం కోసం అవినీతికి పాల్పడి డబ్బు తీసుకొంటూ డ్యూటీని మరిచిపోయి అందుకు విరుద్ధంగా పని చేస్తున్నాడు.

ఒక క్రిమినల్ కేసు కోర్టులో రుజువు కావాలంటే సాక్ష్యం పటిష్టంగా ఉండాలి. ఒక నేరం జరిగినప్పుడు ఆ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన వాళ్ళను, పరోక్షంగా ఆ సంఘటన గురించి చెప్పగలిగే వారిని సాక్షులు అనవచ్చు. వారు కోర్టులో చెప్పే విషయాలను సాక్ష్యం అంటాం. సాక్షులు చెప్పే సాక్ష్యంలో ఏ మాత్రం తేడాలున్నా నిందితుల తరపు న్యాయవాది దాన్ని అబద్ధం కేసుగా చిత్రీకరిస్తాడు. కేసు నిలువదు.

ఒక కేసు నమోదయ్యాక పోలీసులు ఆ కేసు గురించి వివరాలు తెలిపిన వ్యక్తుల నుండి వాంగ్మూలాలు తీసుకొని వారి స్టేట్‌మెంట్స్ లిఖిత పూర్వకంగా కోర్టుకు సమర్పిస్తారు. ఉదాహరణకు యాక్సిడెంట్ కేసులో ఒక ప్రత్యక్ష సాక్షి పోలీసులకు చెప్పిన స్టేట్‌మెంట్ ఇలా ఉంటుంది.

"నా పేరు రవీందర్, తండ్రి రాజయ్య, వయస్సు 26. వృత్తి హోటల్ వ్యాపారం. నేను నిన్న సాయంత్రం నాలుగు గంటలకు నా హోటల్‌లో ఉండగా ఈ యాక్సిడెంట్ జరిగింది. హన్మకొండ వైపు నుంచి వస్తున్న స్కూటర్‌ను మా ఊరి క్రాస్‌రోడ్ వద్ద ఒక ప్రైవేటు జీపు మూల తిరుగుతూ ఢీకొట్టింది. స్కూటర్ నడుపుతున్న వ్యక్తికి కుడికాలు, చెయ్యి విరిగాయి. ఈ సంఘటన నా హోటల్‌కు పది గజాల దూరంలో జరగటం వల్ల నేను ఇదంతా చూశాను. స్కూటర్ నడుపుతున్న వ్యక్తి రోడ్డుకు ఎడమ వైపు ప్రయాణిస్తూ నెమ్మదిగానే వెళుతున్నాడు. జీపు డ్రైవర్ మాత్రం అతివేగంగా, అజాగ్రత్తగా జీపును నడుపుతున్నాడు. జీపు డ్రైవర్ మూల తిరిగి మెయిన్ రోడ్డు పైకి జీపును తిప్పటంతో వేగాన్ని అదుపు చేయలేకపోవటంతో స్కూటర్‌ను గుద్దేశాడు. జీపు డ్రైవర్ అతి వేగం, అజాగ్రత్త వల్లనే ఈ ప్రమాదం జరిగింది."

ఇంకా మరికొన్ని వివరాలు ఈ సాక్షి చెప్పాడు. స్కూటర్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి వివరాలు, స్కూటర్ నెంబర్, జీపు డ్రైవర్ వివరాలు, జీపు నెంబర్ చెప్పాడు. ఇతనిలాగే మిగతా సాక్షుల స్టేట్‌మెంట్లను కూడా పోలీసులు తయారు చేస్తారు. పోలీసు స్టేట్‌మెంట్ చెప్పిన ప్రకారమే సాక్షులు కనుక కోర్టులో సాక్ష్యం చెపితే జీపు డ్రైవర్‌కు శిక్ష పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఇలాంటి సందర్భంలోనే రామారావు అవసరం జీపు డ్రైవర్‌కు పడుతుంది. అతనిపై నేరం రుజువు అయితే ఐ.పి.సి. సెక్షన్ 338 కింద వెయ్యి రూపాయల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష పడుతుంది.

మరో నెల రోజుల తర్వాత జీపు డ్రైవర్‌పై విచారణ మొదలైంది. అప్పటికే జీపు డ్రైవర్ రామారావును తన వైపుకు తిప్పుకోవటం వల్ల సాక్ష్యాలను తారుమారు చేయటానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. సంఘటనను చూసిన ప్రత్యక్ష సాక్షి రవీందర్ సాక్ష్యం చెప్పటానికి సాక్షి బోనులోకి ప్రవేశించాడు.

బెంచి క్లర్కు రవీందర్ చేత ప్రమాణం చేయించాడు. "దేవుని మీద ప్రమాణం చేసి అంతా నిజమే చెపుతాను. అబద్ధం చెప్పను" అని రవీందర్ ప్రమాణం చేశాడు.

ఈ కేసు గురించి రవీందర్ తనకు తెలిసిన విషయాలను చెప్పాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరాడు.

రవీందర్ తన వివరాలన్నీ ఉన్నదున్నట్టుగా చెప్పాడు. కానీ తన హోటల్ ముందు స్కూటర్‌ను జీపు ఢీకొట్టడం తాను చూడలేదని చెప్పాడు. యాక్సిడెంట్ ఎలా జరిగిందో తనకు తెలియదని బుకాయించాడు. పోలీస్ స్టేట్‌మెంట్‌కు విరుద్ధంగా అబద్ధం చెప్పాడు.

కోర్టుకు సహకరించని సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టు అనుమతితో క్రాస్ ఎగ్జామినేషన్ చేయటం మొదలు పెట్టాడు. యాక్సిడెంట్ జరిగినప్పుడు చూసి, ఇప్పుడు నేరస్తునికి సహకరించేందుకు అబద్ధం చెబుతున్నావా ప్రశ్నించాడు. రవీందర్ పోలీసులకిచ్చిన స్టేట్‌మెంట్‌ను పబ్లిక్ ప్రాసిక్యూటర్ చదివి వినిపించాడు. అయినప్పటికీ పోలీసులకు ఆ విధంగా చెప్పలేదని రవీందర్ జవాబు చెప్పాడు. కోర్టు ముందు ఏది చెబితే దాన్నే నిజమైన సాక్ష్యం అంటారు.

రామారావు కృషి వల్ల మిగతా సాక్షులు కూడా రవీందర్ మాదిరిగానే అంతా నిజం చెపుతామనే ప్రమాణం చేసి అంతా అబద్ధం చెప్పారు.

జీపు డ్రైవర్ నేరం చేసినట్లు తగిన సాక్ష్యం లేకపోవటంతో మేజిస్ట్రేట్ అతడిని నిర్దోషిగా విడుదల చేశారు. రామారావు లాగా అందరూ ఉంటారనీ, పోలీసులందరూ తాము నిందితులపై నమోదు చేసిన కేసులను తారుమారు చేస్తారని అనలేం. శిక్షలు పడాలనే ఎక్కువ మంది కోరుకుంటారు. కానీ రామారావు మాత్రం ఇంకా తనశక్తి మేరకు నిందితులకు సహకరించి వారు నిర్దోషులుగా విడుదలయ్యేందుకు కృషి చేస్తూనే వున్నాడు. ☆

రెండు ఉత్తరాలు

రుక్మిణి

సకల దేశ ఏకైక ప్రపంచాధినేత అమెరికా అధ్యక్షులవారి దివ్యసముఖమునకు -

మహానుభావా.. ఆపద్బాంధవా.. అంతర్జాతీయ అంగరక్షకా!

ఈ ప్రపంచంలో మీ సామ్రాజ్యాన్ని కాదనే హక్కూ.. కాదని బతకగల దారీ ఎవడికీ లేదని నా నమ్మకం! మా దేశంలో ఎవరెంత గోల చేసినా... వద్దని వారించినా నేను మీకు బేషరతు మద్దతు తెలుపుకుంటున్నాను.. తాలిబాన్లు... అఫ్ఘన్ అమాయక ప్రజలు ఎవరెక్కడ చస్తే నాకేం! అందుకే శస్త్ర చికిత్సలు జరిగిన నా మోకాలి చిప్పలు బహు ఇబ్బందులు పెడుతున్నా నేను మీకే సాగిలపడుతున్నానని మీరు గ్రహించగలిగితే అంతకు మించి ఈ అల్పజీవి జన్మకు మరో ముక్తి మార్గం ఏముంటుంది? మీ యుద్ధ విమానాలు బేఖాతర్‌గా మా దేశంలో దిగి కాలసినంత ఇంధనం నింపుకోవచ్చు... మా ఆతిధ్యం... అతిధి మర్యాదలు పొందవచ్చు! మీ సైన్యం మా ఎర్రకోట మీద కవాతులు చేసినా మాకేం అభ్యంతరం లేదు. అసలు మా రక్షణ బలగాలన్నింటినీ మీరు ఊఁ అంటే 'ఉస్కో'మని మీకు అప్పజెప్పగలను - మొన్న 'మన ఎఫ్.బి.ఐ. వారు హైదరాబాద్‌కు వచ్చి రహస్యంగా విచారణ జరిపి వెళ్ళారట.. దీనికి బోడి రహస్యమెందుకూ? మీ సి.ఐ.ఎ.-ఎఫ్.బి.ఐ. ఇతర పటాలం అంతా ఢిల్లీ నుండి గల్లీ దాకా దిగబడ్డా మాకేం అభ్యంతరం లేదు - బాహాటం.. బహిర్గతం!

మానవోత్తమా.. దీనజన మాన సంరక్షకా..

దేశదేశాల్లో కల్లోలాలు సృష్టించడం.. రాజ్యాధినేతల్ని రాత్రికి రాత్రే పరలోకానికి పంపించడం.. 'తొత్తు' సామంతులను గద్దెనెక్కించడం మీకు వెన్నతో పెట్టిన విద్య అని సకల జగంబునకు తెలుసు! ఇటలీలోనో పిటలీలోనో వున్న రాజు జహీర్‌షాను 'తొత్తు'గా పల్లకీలో అఫ్ఘనిస్తాన్‌లో ప్రతిష్టించి 'మీ' పాలన సాగించినా మా హృదయాలు మొన్నటి వరదలా ఉప్పొంగి పులకించి పోతాయి. ప్రజాస్వామ్య.. మానవ విలువలనూ... పర్యావరణాన్ని మీరే కాపాడడం కోసం ఆ భగవంతుడే ఈ కలియుగంలో మీ దేశాన్ని సృష్టించిందని నా అనుమానం! ఉగ్రవాదం నశించాలీ.. పర్యావరణం జిందాబాద్!

ప్రజాస్వామ్య నాయకా... సంభవామి యుగే.. యుగే..!

మా పక్కలో బల్లెం... డొక్కలో కత్తీ.. ఆ పాకిస్తాన్‌తో పలుమార్లు నేను మీరాడినట్లే నేనూ చదరంగపుటెత్తులు.. వేయబోయి చిత్తయిపోయినాను. నా బస్సు యాత్ర బుస్సుమంది. ఆగ్రా సదస్సు కాస్తా బాంగ్రా డాన్సయ్యింది. మీరేమో అతి గుంభనగా వారినే వెనకేసుకొస్తున్నారు - నాకేమో తత్తరపుడుతుంది - వారికన్నా మీకు మేమేం తీసిపోయాం? మనలో మాట! మీగ్గాని కాశ్మీరే కావాలంటే లీజుకో... కంట్రాక్టుకో కట్టబెట్టడానికి మీతో చర్చలకు సిద్ధం! పాక్ ఉగ్రవాదులు మా కాశ్మీర్ అసెంబ్లీపై దాడి చేశారు - జెహేమహ్మద్ ముఠా పంపగా వచ్చిన మానవ బాంబులు వచ్చి.. అబ్బో... మారణహోమం సృష్టించారు. మీరు కనీసం సానుభూతైనా చూపించకుండా మా ప.బల్లెం-డొ.కత్తీ పాకిస్తాన్‌నీ ఉగ్రవాద దేశాల జాబితాలో ఎందుకు చేర్చలేదో? హబ్బా.. కన్నుకు కన్ను.. పన్నుకు పన్ను పేరిట ఉగ్రవాదం అంతం చూడ్డానికి మీరు అత్యుగ్రవాదాన్ని చరిత్రలో ఎన్నిమార్లు ప్రేరేపించినా.. మీకు మీరే స్వయంగా మీరే దిగినా మేం చప్పట్లూ... చంకలూ చరిచి మా రాజభక్తిని ప్రదర్శిస్తూ మీకు మా గేట్లు బార్లా తెరిచి, ఎక్కడా సంతకాలు గిలకమంటే అక్కడ మీ దేశంపై గల మక్కువతో గిలికే దాసాను దాసుడ్ని! మీదేశం, ఉగ్రవాదం.. టవర్లూ.. ఆయిలు డాలరు పేర్లు చెప్పి మా ప్రజలపై పన్నుల బాంబులు కూడా తెగబడి వేసేస్తున్నాను - మీరు 'క్రూసేడన్నా' నేను 'కూకూ' అంటిని! మత యుద్ధం అంటే 'మరే-మరే' అన్నానా? కమెండోలంటే 'కానీ'మన్నాను - మాదేశంలో మీకిష్టం కాని 'సిమి'ని 'కాదుసుమీ' అని మూసిపారేశాను గదా!

ప్రపంచ దేశాలన్నీ మీ చర్యలనెండగడుతూ ప్రదర్శనలు.. ఆందోళనలు చేస్తున్నా నేను మీకు వ్యతిరేకంగా నోరు విప్పానా? విప్పుతానా? కొన్ని అత్యవసర పరిస్థితుల్లో 'సిగ్గు'ను పూర్తిగా త్యజించి పారేయడం అవసరం అని నా అభిప్రాయం!

ప్రపంచ సామ్రాజ్య సార్వభౌమాధినేతా!

వందకోట్లకు పైబడిన మా జనం ఎవడికాళ్ళ మీద వాడు నిలబడలేకా.. మోకాళ్ళ చిప్పలు అరిగి మీ దాకా దేకలేక ఆబగా మీ కనుసన్నల కటాక్ష వీక్షణాల కోసం దేబిరిస్తున్నా మేమూ ఏమీ తీసిపోలేందండేయ్! మా పరిధిలో మేమూ ఉగ్రవాదుల్ని ఉప్పుపాతరేసేందుకు ఆరెస్సెస్ - బజరంగదళ్ - విహెచ్‌పీ - మూకలను తయారు చేసి, కాదుకూడదన్న వాడ్నల్లా ఖతం చేసే కార్యక్రమంలోనే లాగూ - లాఠీ లడాయి కవాతులతో బాటు పిస్టల్... రైఫిల్.. ట్రయినింగులిచ్చుకుంటున్నాం! అన్నట్టు మా మతం పేరిట త్రిశూలాలను కదు కసాయిగా తయారు చేసి ఉగ్రవాదులపై వుసిగొలుపుతున్నాం!

రాజకీయ దురంధరా!

నా మోకాలి చిప్పలు వణుకుతున్నాయి... చేతులు చెవట్లు పట్టి చావ చచ్చి చేతులు జోడించి అడక్కతప్పదు - మీరు పన్నే కుటిల కుతంత్రాలలో మా పొరుగు దేశం కన్నా కాస్తంత పై మెట్టు మీద నన్ను కాని కలిస్తే కాశ్మీరు మీ ఇష్టం! మీ మాటే మా మాట! మీ బాటే మా తోట! మీ మార్కెటు మా జనాల జన్మజన్మల వరాల పంట!

చిత్తగించవలయును.

మీ అత్యంత విశ్వాసపాత్రుడు
వాజ్‌పేయి

☆ ☆ ☆ ☆

ప్రధాని వాజ్‌పేయిజీ -

ప్రస్తుతం నేను క్షేమం. నా నిదర గురించిన మీ వాకబుకు థాంక్స్ - టవరు మీద దాడి జరిగిన వెంటనే నా జాగ్రత్త కోసం నేను కాకులు దూరని చీకటి కలుగులో దూరి నన్ను కాపాడుకున్నాను. జనాల సంగతి సరేసరి! మా స్వేచ్ఛాదేశంలో ఎవడి చావుకు ఎవడి ప్రేమలకు ఎవడు బాధ్యుడు! మీరు చాలా సంగతులు తెలిపారు. సంతోషం! మా పరిమితులు మాకుంటాయి. మీలాంటివారు మా దేశానికి చాలా అవసరం! మమ్మల్ని ఇట్లా అంటకాగే ఎవరినైనా మేం కాపాడుతూనే వారి వారి దేశాల్లో మా చిటికెన వేలు చీకే తొత్తులను సర్వదా మేం కాపాడుకుంటూ.. ప్రపంచ శాంతినీ, పర్యావరణాన్ని కాపాడతామని మీకు తెలుసు! ప్రపంచం నిండా తాలిబాన్లు యల్టీటీలను... అబ్బో.. చాలా మందిని తయారు చేసి ఉద్రిక్తంగా ఉంచకపోతే మా ఆర్థిక వ్యవస్థ మందగిస్తుందని కూడా మాకు తెలుసు! ఈ యుద్ధం కలకాలం కొనసాగాలని మనమందరమూ కోరుకోవాలి! దీన్ని మీరు తెలివిగా ప్రజలను పెడదోవ పట్టించి - ఈ యుద్ధం బూచిని చూపి నగదుగా మార్చుకునే పథకాలు రూపొందించుకుంటూ మాకు మాత్రం బేషరతు మద్దతులు 'మన' ఉమ్మడి శత్రువుపై ధిక్కారాన్ని ప్రకటించండి! మా శత్రువే మీ శత్రువు.. మీ శత్రువే మా

మిత్రుడు.. అన్నది మా పాలసీ! మీ దేశంలోకి మా సైన్యాల్ని పంపి స్థావరాలు ఏర్పాటు చేసుకుంటేనే మీ ఉపఖండంలో మీకూ, పాకిస్తాన్ వారికీ శాంతి వుంటుంది. మీరు బుద్ధిగా , అణుకువగా అణిగి మణిగి వుంటారని మా అనుభవం చెబుతుంది.

పలు ఉగ్రవాద సంస్థలతో.. దేశాలతో మేం బహుముఖ పోరు సలిపే క్రమంలో మీరు ఏకోన్ముఖంగా మాకు అందించే సహాయానికి కృతజ్ఞతలు. కాలక్రమంలో మీ దేశాన్ని టెర్రరిస్టు దేశంగా ప్రకటించే అవసరం కలగవచ్చు. మీరు మాతో తప్ప ఏ ఇరుగుపొరుగు వారితో సఖ్యతగా వున్నా అది మీకూ ప్రపంచ శాంతికీ.. పర్యావరణానికీ భంగకరం అని గమనించగలరు.

కాశ్మీర్ అసెంబ్లీ బాంబు దాడిలో ఓ యాభై మంది చస్తే మునిగిపోయిందేమీ లేదు - అది రోజువారీ కార్యక్రమంగా వుండగలదని కోరుకుందాం!

మీ శూలాలు.. పిస్టళ్ళు.. తూటాలు లాభం లేదు - టోకున మా వాడబడినవీ, వాడినివీ రకరకాలు ఆయుధాలు గుట్టలుగా మా దగ్గిర వున్నై గదా! ఫిరంగులు.. పిచికారీలు టాంకులు.. తవంచాలు.. తపలాలు.. తప్పెట్లు.. వాటిని పెద్ద మొత్తంలో మీరు కొంటే మీ రక్షణ శాఖ మంత్రులకూ.. మీ అల్లుళ్ళకూ, అధికార్లకూ ముడుపులు ప్రజలందరికీ నిజమైన శాంతి సౌభాగ్యం చేకూరుతుందని గ్రహింపగలరు. మీరు మాతో కలిసి 'ఉగ్రవాదం'పై ఉమ్మడిపోరు సలపడానికి మాకేం అభ్యంతరం లేదు. పక్కనున్న చైనా మీదనో, మరో మాకు గిట్టని దేశం మీద మీరు యుద్ధం ప్రకటించండి - యుద్ధం లేనిదే శాంతి లేదు - పర్యావరణ రక్షణ కోసం సమరం! అఫ్ఘన్ల మీద యుద్ధం ప్రకటించండి - పాకిస్తాన్ సంగతీ... మీ సంగతీ నింపాదిగా కాశ్మీర్‌లో కలుసుకుని ముచ్చటించుకుందాం! సెలవ్-

మీ
జార్జి బుష్

నోటు : నాకు అమితాశ్చర్యం కలిగించే విషయం.. స్వదేశీ జపం చేస్తూ మా సామ్రాజ్యవాదం పట్ల మీరింతగా కుమ్మక్కై మా తోకనే పట్టుకు వేలాడ్డం! ఇన్నేండ్లయినా మీ బానిస బుద్ధి చెక్కు చెదరకుండా ఉక్కులా గిడసబారి వున్నందుకు పొంగిపోతున్నాను - కానీ నేనే సిగ్గుపడిపోయేలా సాగిలపడితే మేము మరో 'తొత్తు'ను వెదుర్కోవాల్సి వుంటుందేమో!! ☆

లాంఛనం

కొండబాబు

రైతు బజారులో సుభద్రను చూసి ఆశ్చర్యపోయింది కమల. 'అవునూ.. కూరగాయలకు ఇంత దూరం వచ్చిందేం?' అనుకొని మళ్ళీ ఆశ్చర్యపోయింది.

పిలుపు వినబడి తుళ్ళిపడి చూసిన సుభద్ర తనూ ఆశ్చర్యపోయింది.

"ఓ కమలా..!' అంది ఆనందంగా. ఏంటి? ఇంతదూరం. మా ఏరియా రైతుబజారుకొచ్చావ్" కమల అడిగింది.

"ఆ మా ఏరియాలో వుంది నిజమైన రైతు బజారు కాదులే.. రైతులకు బదులు దళారీలు అమ్ముతున్నారు. కూరగాయలు తాజాగా వుండటం లేదు".

"సరే కొనడమైందా? పద బయటకు"

ఇద్దరూ బయటకొచ్చాక అడిగింది సుభద్ర "ఆ.. మీ తమ్ముడు ఏం చేస్తున్నాడు? అతనికో సంబంధం వుంది. నీకు ఫోను చేద్దామనుకుంటూనే అలా గడచిపోతోంది."

"సంబంధమా? వాడింకా సెటిలవ్వలేదుగా"

"ఇంతకీ ఏం చేస్తున్నాడో చెప్పలేదు"

"మావారు ఇంటర్నెట్ బ్రౌజింగ్ సెంటర్ పెట్టించారు"

'ఎప్పుడు? ఓపినింగ్‌కి మమ్మల్ని పిలవనే లేదు."

"ఆ ఓపినింగంటూ పెద్దగా ఆర్భాటమేమీ లేదు.. ఏదో లాంఛనంగా ప్రారంభించాం." "ఇంతకీ సంబంధం వివరాలు చెప్పనేలేదు."

"అమ్మాయి పీజీ చదువుతోంది. వాళ్ళనాన్న రైల్వేలో ఇంజనీరు. బంధువులవుతారు. లాంఛనాలు అవీ బాగానే ఇస్తారు.

'చూద్దాం మనదేముంది. వాడికి నచ్చాలిగా"

"అలాగే మాట్లాడి ఫోన్ చెయ్.."

★ ★ ★

పెళ్ళిలో కట్నాలు, లాంఛనాలు ఇవ్వటాలు, పుచ్చుకోవడాలు రెండూ చట్టప్రకారం నేరమే. అయినా ఇంత బహిరంగంగానే వాటి గురించి మాట్లాడుకుంటూ పుచ్చుకుంటారు. ఇంకా ఆ తర్వాత పరిమాణాలు తెలిసినవే. పత్రికల్లో వస్తున్నవే.

అయినా ప్రతిఘటనా చర్యలు తగినంతగా లేవనేది నిర్వివాదాంశం.

అయితే, ఈ వ్యవహారం కాదు. చర్చనీయాంశం మన చర్చ 'లాంఛనమే'. ప్రస్తుతం 'లాంఛనం' అనే పదం గురించి. అంటే లాంఛనప్రాయంగా చర్చ అనికాదు. మనం చర్చించే పదం 'లాంఛనం' అని. సుభద్ర, కమల సంభాషణలో ఈ పదం రెండుసార్లు వచ్చింది. రెండు సార్లు రెండు వేర్వేరు అర్థాలనిస్తూ.

మొదటి మాటలో 'ఏదో కుప్లంగా కానిచ్చేశాం!' అనే అర్థం ఉంది. 'అంటే ఏదో చేయాలి కాబట్టి పేరుకు ప్రారంభోత్సవం జరిపాం తప్ప... చేయాల్సినంత గొప్పగా చేయలేద'ని అర్థం.

రెండోమాట 'లాంఛనాలు బాగానే ఇస్తారట' అంటే కానుకలు బాగా ఇస్తారని అర్థం. సాధారణంగా ఏ భాషలోనైనా ఒకే పదానికి అనేక అర్థాలుండటం సహజం. వాటినే నానార్థాలని కూడా అంటుంటాం. 'బ్రహ్మ' అనే పదానికి ఉన్న అర్థాలు చూస్తే అదొక బ్రహ్మ పదార్థంగా అనిపిస్తుంది.

సరే ఇక్కడ 'లాంఛనానికి కూడా నానార్థాలున్నాయనిపిస్తోంది పై అర్థాలు చూస్తే.

వాస్తవం తెలుసుకోవాలంటే మూలభాష, మూలార్థాన్ని గ్రహించాల్సిందే.

ఈ పదం సంస్కృతంలోనిది. సంస్కృతంలో ఈ పదానికి అర్థం గుర్తు అని. తెలుగులోని అర్థం దానికి లేదు. తెలుగులోనేమో అసలు ఈ పదమే లేదు. ఇదేదో తిరకాసుగా అనిపిస్తోంది కదూ! ఈ సంస్కృత 'గుర్తు'కీ, మన 'లాంఛనా'లకీ సంబంధమేమిటో ఒక పట్టాన అర్థం కాదు. అయినా ఓపిగ్గా పరిశీలిద్దాం.

'లాంఛనం' అనే మాటకు గుర్తు కదా సంస్కృతార్థం. అలాగే పరిశీలించుకుంటూ పోదాం. వివాహాది శుభకార్యాల్లో వధువు తరపువాళ్ళు వరుడికే కాకుండా, బంధుమిత్రులు కూడా కొన్ని కానుకలిస్తారు. అలాగే మరికొన్ని కార్యాలలో కార్యక్రమం జరిపిన ఇంటివారు కూడా చిన్నచిన్న కానుకలను ఇస్తుంటారు. ఆయా కానుకలపై ఆ సందర్భం, తమ పేరు సైతం రాసి. ఎందుకు ఇలా ఇస్తారు? అంటే గుర్తు కోసం. ఏ గుర్తు? అంటే- ఆ సందర్భమూ, ఆ వ్యక్తీనూ. అంటే గుర్తుగా ఇచ్చే కానుకలే 'లాంఛనా'లుగా సంప్రదాయమయ్యాయి. కొన్ని సంస్థల తాలూకూ ప్రారంభం, వార్షికోత్సవం, సన్మానం వంటి వేడుకల్లో 'మెమెంటో'లు ఇస్తారు. అంటే జ్ఞాపికలు.. అనగా గుర్తులు. అర్థమైంది కదూ!

ఇక ఏదో 'లాంఛనంగా ఆ తంతు జరిపించాం' అనే మాటలో లాంఛనానికి అర్థమేమిటి? అనేది మరో ప్రశ్న. ఇక్కడా అంతే. అది గుర్తుంచుకోతగ్గ సందర్భం కాబట్టి కేవలం 'గుర్తు'గా జరిపాం తప్ప భారీగా కదా అని చెప్పడమే. ఇదీ లాంఛనం కథ. ☆

పాఠక స్పందన

ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం

అక్టోబర్ 7 ఆదివారం అనుబంధంలో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న వరంగల్ పత్తి రైతుల మరణాల సందర్భంగా ప్రచురించిన కవర్ స్టోరీ 'పురుగుల్లా రాలిపోతున్న రైతులు' నకిలీ మందుల వల్ల కలిగే పరిణామాలను చక్కగా వివరించింది. పురుగు మందులను పిచికారీ చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. పురుగు నివారణకు పత్తి రైతుల్లో అవగాహన పెంచాల్సిన వ్యవసాయ శాఖ, ప్రభుత్వం ఇప్పటికీ మేల్కొని తగు చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనంగా కనిపిస్తోంది.

- బట్టా రామకృష్ణ, సౌత్‌మోపూర్ గ్రామం, నెల్లూరుజిల్లా

బాగుంది

అక్టోబర్ 7 ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురించిన బాల నేస్తాలులో అగ్గిపుల్లలతో మ్యాజిక్ చాలా బాగుంది. ఇది సెంటర్ పేజీలో ఫైల్ చేసుకోవడానికి వీలుగా ప్రచురిస్తున్నందుకు ధన్యవాదాలు. 'సిగ్గుపడిన పులి' కథ బాగుంది.

- పి.ఎస్.ఎస్.కిరణ్, రామచంద్రాపురం, తూర్పుగోదావరిజిల్లా

ధూమపానం నష్టదాయకం

7వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'ధూమపానం తెచ్చే నష్టాలు' చక్కటి అంశాలను అందించింది. ధూమపానం అన్ని విధాలా నష్టదాయకమని తెలియజేసిన తీరు బాగుంది. అదే సంచికలో కచేరి శీర్షికలో 'పస్తు మస్తుమస్తు - ఆకలిరాజకీయం!' ఎంతో బాగుంది.

- ఎస్.శ్రీదేవి, కె.రేవతి దేవి, డా॥ ఎస్.సి.రావు, మల్లంపేట, విజయనగరం జిల్లా

విజ్ఞానదాయక విషయాలు కావాలి

మొదట్లో బాల నేస్తాలు పేజీలో విజ్ఞానదాయకమైన విషయాలు ప్రచురించారు. వాటిని కొనసాగిస్తే బాగుంటుంది. బాలల కథలు బాగుంటున్నాయి.

- సంతోష్ కుమార్, భద్రాచలం